# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం | 31 ఆగస్టు 2025 | ■ 16 పేజీలు




సండే స్పెషల్

వీటితో ఆహారం..
ఎంతో ఉపయుక్తం
దీర్ఘకాలిక రోగాలకు
తృణధాన్యలతో చెక్..
ఒకప్పుడు గరీబోళ్లకే
పరిమితం..
నేడు ప్రతీ ఒక్కరూ
పాటించాల్సిన
ఆహార
నియమం

## మిల్లెట్ మంత్ర..!

తృణధాన్యం..
చిరుధాన్యం..!
పేరుఏదైతేనేం..
ఈ గింజలు
బహుపోష్టికం..!
మానవదేహానికి ఎంతో
ఉపయుక్తం..! శ్రమజీవుల
ఆహారం..! కండరపుష్టికి...,
సంపూర్ణ ఆరోగ్యానికి
ప్రధానం..! ఇవి ఎంతో
రుచికరం.. దీర్ఘకాలిక వ్యాధులకు
ఔషధం..! ఒకప్పుడు గరీబోళ్లకు
ప్రీతికరం..! నేడు ప్రతి ఒక్కరికీ
అవసరం..! ప్రతి మనిషికీ సర్వరోగ
నివారణం..! అందరూ
ఆచరించాల్సిన ఆహార నియమం..!
'మిల్లెట్ మంత్ర'తో దీర్ఘాష్షుకు
మార్గం సుగమం..!!

తృణధాన్యాలతో ఆరోగ్య'మస్త్'

-మధ్యపేజీలో..



14

## పూలాజీ బాబా బోధలు స్ఫూర్తిదాయకం

■ బాబా బోధనలు రాబోయే తరాలకు అందించాలి ■ పార్లమెంటు సభ్యులు నగేష్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే
■ ఘనంగా పూలాజీ బాబా జయంతి వేడుకలు ■ వేలాది తరలిచ్చిన బాబా భక్తులు ■ పోలీసుల బందోబస్తు చర్యలు
■ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ■ ఆధ్యాత్మిక మార్గాలపై ఎగ్జిబిషన్ స్టాళ్ల ఏర్పాటు



12

### ఆన్‌లైన్ ఆటకు బానిసై..

## ఖాతాదారుల డబ్బులు కొల్లగొట్టి

■ ఎస్‌బీఐ బ్యాంకు కుంభకోణంలో 'బెట్టింగ్' ■ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసగా మారి..
■ బ్యాంకు సొమ్ము ఆన్‌లైన్ ఆటలో పెట్టిన క్యాషియర్ ■ వందలాది కుటుంబాల్లో ఆందోళన
■ పైగా ఉత్తమ ఉద్యోగి అవార్డు ■ ముత్తూట్ ఫైనాన్స్‌లో పోలీసుల విచారణ
■ మంచిర్యాలలో పలు గోల్డ్‌లోన్ ఫైనాన్స్‌లు, వడ్డీ వ్యాపారులను విచారిస్తున్న పోలీసులు
■ దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ■ వీడనున్న బ్యాంకు కుంభకోణం చిక్కుముడి..

మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్‌బీఐ బ్రాంచి-2లో ఇటీవల జరిగిన ఆభరణాలు, నగదు కుంభకోణంలో పోలీసుల విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తు న్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన బ్యాంకు క్యాషియర్ రవీందర్ ఆ తర్వాత ఆట వ్యసనంగా మారినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లో పెద్దఎత్తున లాభం వస్తుందని ఆశపడి క్రికెట్‌తోపాటు ఇతర ఆన్‌లైన్ ఆటలు ఆడి కోట్లాది రూపాయలు పోగొట్టుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బ్యాంకు క్యాషియర్ రవీందర్‌తో సం బంధాలున్న 40మందిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలి సింది. బ్యాంకులో రూ.12.61 కోట్లు విలువైన బంగారు ఆభరణాలు, రూ.1.10కోట్లు సదరు క్యాషియర్ కాజేసి ఖాతా దారులకు శఠగోపం పెట్టిన విషయం తెలిసిందే. ఈ కేసును ఛేదించేందుకు పోలీసులు గత రెండు రోజుల నుంచి మం చిర్యాలలోని ఎనిమిది ప్రైవేటు గోల్డ్‌లోన్ ఫైనాన్స్‌ల్లో విస్తృ తంగా సోదాలు చేస్తున్నట్లు తెలిసింది. శుక్ర, శనివారాల్లో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 16 నుంచి 17 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.



16

### భూ సేకరణ ప్రక్రియ


## నిబంధనల ప్రకారం చేపట్టాలి

■ సింగరేణి సంస్థ సిబ్బంది పరిపాలన, సంక్షేమ విభాగ సంచాలకులు గౌతమ్..
■ మంచిర్యాల, పెద్దపల్లి జిల్లా కలెక్టర్లు, సింగరేణి జీఎంలతో సమీక్షా సమావేశం

సింగరేణి పరిధిలో భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని సింగరేణి సంస్థ సిబ్బంది పరిపాలన, సంక్షేమ విభాగ సంచాలకులు గౌతమ్ పొట్రు అన్నారు. శనివారం జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలతో కలిసి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పరిధిలో చేపట్టే భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని తెలిపారు.

## గోదావరి జలతాండవం

■ నీటమునిగిన బాసర
■ పెరిగిన గోదావరి నీటి మట్టం
■ ఎగువ ప్రాంతం నుంచి భారీగా గోదావరికి వరద ఉధృతి
■ జలదిగ్బంధంలోనే బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రం
■ ఇంట్లో నుంచి తెప్పలపై బయటకు వస్తున్న జనం





16

## రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం

■ వరద నష్టం నివారణ చర్యలు త్వరితగతిన చేపట్టి ప్రభుత్వానికి వేదిస్తాం
■ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
■ పంట పొలాలను పరిశీలించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

జిల్లాలో పంట నష్టపోయిన రైతులందరికీ చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ భరోసా ఇచ్చారు. శనివారం బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామంలో వరదల వల్ల నష్టపోయిన పంటలను కలెక్టర్ పరిశీలించారు. రైతులు, వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రైతుకు పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.



## 10 రోజుల్లో స్థానిక ఎన్నికలు

■ పండుగే.. పండుగ.. ■ సెప్టెంబర్‌లో సర్పంచ్ ఎలక్షన్స్ ■ కేబినెట్ భేటీతో స్థానిక ఎన్నికలపై క్లారిటీ
■ గ్రామాల్లో మరింత సందడి వాతావరణం ■ మందుబాబులకు మస్త్ పసంద్..
■ చేను, చెల్కా, రచ్చబండ.. అంతటా అదే చర్చ ■ గణేష్ మండపాల్లో ఆశావహుల సందడే సందడి..



# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

■ ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి ■ మద్యం సేవించి వాహనాలు నడపొద్దు
■ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసుల నమోదు ■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి రెవెన్యూ, పోలీసు, రవాణా, రోడ్లు-భవనాలు శాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఆర్‌టిసి. అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, వైద్య ఆరోగ్యశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్) లను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారులపై పశువుల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు పశువులను తరలించేందుకు జిల్లా కేంద్రంలో గోశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించడంపై కఠిన చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనం నడుపుతూ 2వ సారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేయాలని తెలిపారు. భవనాలలో సెల్లార్‌ను పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించాలని, అద్దెకు ఇవ్వకూడదని తెలిపారు. జాతీయ రహదారి 63కి ఇరువైపులా షోల్డర్లు, వంతెనలు, కల్వర్టులకు పెయింటింగ్, క్రాస్-డ్రైనేజ్ వ్యవస్థ, నాలుగు వరుసల కాన్ఫిగరేషన్ నవీకరణ అంశాలపై పర్యవేక్షించాలని తెలిపారు. మూల మలుపులు, వేగనిరోధకాలు, వేగ పరిమితి, యు- టర్న్, ఇతర సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు



చర్యలు తీసుకోవాలని తెలిపారు. రహదారుల మరమ్మత్తులు జరిగే ప్రాంతాలలో సూచిక బోర్డుల ఏర్పాటు, ప్రమాదాల నియంత్రణలో భాగంగా విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు, ఇతర వాహనచోదకులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగ నియంత్రణ, సూచిక బోర్డులు, రేడియమ్స్, లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో అవసరమైన అటవీ అనుమతులు పొందాలని తెలిపారు. జిల్లాలోని జన్నారం మండలం పొనకల్, శ్రీరాంపూర్ ఆర్.టి.సి. బస్టాండ్‌లో బస్సులు రోడ్డుపై నిలుపడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, బస్టాండ్ లోపలికి వెళ్ళి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచిర్యాల పట్టణం, మందమర్రి మండల కేంద్రం లోని రైల్వే పై ఓవర్ బ్రిడ్జిల వద్ద రోడ్లపై కూరగాయల విక్రయం ద్వారా వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల, బెల్లంపల్లి ఎ.సి.పి.లు ప్రకాష్, రవికుమార్, జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్, రోడ్లు-భవనాలు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, పోలీసు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### యువత మత్తు పదార్థాలకు
## దూరంగా ఉండాలి

**పెంబి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా పెంబి మండలం నాగపూర్ గ్రామంలో శనివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా తనిఖీలు జరిపి సరైన పత్రాలు లేని 40 ద్విచక్రవాహనాలు, 4 ట్రాక్టర్లు, 1 ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఖానాపూర్ సీఐ అజయ్ మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పై పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగించినా, అమ్మినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. వాహనదారులు అన్ని రకాల రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, లైసెన్స్ పత్రాలు కలిగి ఉండాలని, మైనర్లకు బైకులు, స్కూటీ ఇవ్వరాదని, ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఖానాపూర్ సీఐ అజయ్, పెంబి ఎస్సై హన్మండ్లు, కడెం ఎస్సై సాయి కిరణ్ రెడ్డి, ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, దస్తూరాబాద్ ఎస్సై సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఒకే వార్డులో కుటుంబం ఓటర్లంతా ఉండాలి

**బెజ్జూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

గ్రామ పంచాయతీల ఓటర్ల నమోదులో అభ్యంతరాలు ఉంటే, సవరణ చేస్తామని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా, ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించారు. సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. గ్రామపంచాయతీ వార్డుల వారీగా ఓటర్లను సరిచేసుకునేందుకు వీలుందని, రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సరి చేస్తామన్నారు. ఒకే కుటుంబం ఒకచోట, ఒకే వార్డులో ఓటర్లు ఉండాలని రాజ్ గౌడ్ సేవాసమితి కార్యవర్గ సభ్యులు కోడ్పా. విశ్వేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌరీ శంకర్, ఏపీవో రాజన్న,



జూనియర్ అసిస్టెంట్ వసంత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీ వర్ధన్, బీజేపీ నాయకులు సామల తిరుపతి, వసిఖాన్, రాకేష్ దిగంబర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజన్న, సురేష్ గౌడ్, షణ్ముఖ, రంగన్న, శైలేష్ పాల్గొన్నారు.

# విజిలెన్స్ విచారణ జరపాలి

### 10 సంవత్సర కాలంలో జరిగిన అవినీతిని బయటపెడుతాం - కాంగ్రెస్ నాయకులు

**ముథోల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముథోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై క్యూసి, విజిలెన్స్, విచారణ జరిపించాలని ముథోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి,కాంగ్రెస్ యువనాయకులు రావుల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల మరమ్మత్తు,ఉపాధిహామీ పథకంలో నిర్మించిన సీసీ రోడ్లు,డ్రైనేజీలు అనేక అభివృద్ధి నిధులతో నిర్మించిన మొరం రోడ్లు, పీఏసిఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన వివిధ గోదాం కేంద్రాలకు వచ్చిన నిధులపై ,సిఆర్ఎఫ్, నాన్ సీఆర్ఎఫ్ కింద వేసిన బోర్ మోటార్లపై పూర్తి స్థాయి విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. బాసర ట్రిపుల్ ఐటిలో జరిగిన వివిధ అభివృద్ధి పనులపై, పేదలకు సంబంధించిన అసైన్డ్ భూముల కబ్జాలపై, బాసర ఆలయలో అభివృద్ధి పనుల్లో చోటు చేసుకున్న అవినీతి ని ఆధారా లతో సహా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నామని వారు పేర్కొన్నారు. వీటిపై సంబంధిత శాఖ వారు త్వరలోనే స్పందించి విచారణ జరిపించాలన్నారు. 10 సంవత్సర కాలంలో జరిగిన అవినీతిని ప్రజల ముందు పెడతామన్నారు.



## చదువుతోనే అభివృద్ధి సాధ్యం

**జన్నారం, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చదువుకోవాలని, జన్నారం మండల ఎంఈఓ విజయ్ కుమార్ అన్నారు. శనివారం జన్నారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వాలంటీర్లకు ఉల్లాస్ పథకంపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యకు దూరంగా ఉన్న వారిని అక్షరాస్యులను చేయడమే ఉల్లాస్ పథకం లక్ష్యమన్నారు. అలాంటి వారిని గుర్తించి అక్షరాస్యులుగా మార్చాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

### జన్నారం యూత్ కాంగ్రెస్
## కో-ఆర్డినేటర్ల నియామకం



**జన్నారం, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

యూత్ కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ, జన్నారం మండలాల కో-ఆర్డినేటర్లను నియమిస్తూ ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. జన్నారం మండలం లోతరే గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండాడి నాణేశ్వర్ ఖానాపూర్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్గా నియమితులయ్యారు. అలాగే కవ్వాల్ గ్రామానికి చెందిన షాకీర్ అలీని జన్నారం మండలం కో-ఆర్డినేటర్ గా నియమించారు. జన్నారం మండలానికిచెందిన రాహుల్ యాదవును మరో మండల కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేస్తూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

### పాత పెన్షన్ విధానం
## పున:రుద్ధరించాలి

**బజార్‌హత్నూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని టిఎస్ సిపిఎస్ఇయు జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో టీఎస్ సిపిఎస్ఈయూ ఆధ్వర్యంలో గోడ పత్రులను విడుదల చేశారు. ఈ సందర్భంగా టిఎస్ సిపిఎస్ఇయు జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1 న పెన్షన్ విద్రోహ దినం పాటిస్తూ, సంఘం ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన పోరాట సభ నిర్వహించడం జరుగుతుందని, పెన్షన్ ప్రభుత్వాల దయాధాక్షిణ్యం కారాదు, పెన్షన్ ఉద్యోగి హక్కు -భిక్ష కాదన్నారు. సెప్టెంబర్ 1 సోమవారం ఉదయం



11గంటలకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యలయం ముందు టీజిఈజెఏసితో కలసి శాంతియుత నిరసన ప్రదర్శనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణా ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్స్, కార్మికులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సుకుమార్, అభిలాష్, అనిల్ కుమార్, అశ్విన్, మీనాక్షి, అమోల్, మహేష్, భరత్, హరికిరణ్, ప్రసన్న కుమార్, శ్రీనివాస్, జీవన్, పుండాలిక్, కపిల్, సంతోష్, మహేందర్, చందన్ బాబు, ప్రకాష్, రాజు, కాంతం, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వరద పరిస్థితుల దృష్ట్యా
# ప్రజల రక్షణకు పకడ్బందీ చర్యలు

- నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- తాగునీటికి ఇబ్బంది లేకుండాలి
- కంట్రోల్ రూమ్ 08736- 250501 ఏర్పాటు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్..

**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాల కారణంగా ఏర్పడుతున్న వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజల రక్షణ కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి నది తీరంలో, మాతా శిశు ఆసుపత్రి, రామ్ నగర్ ప్రాంతాలలో వరద పరిస్థితిని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంపత్, ఎ.సి.పి. ప్రకాష్, మండల తహసిల్దార్ రఫతుల్లా లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు లోనికి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరిందని తెలిపారు. నది తీర ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో రక్షణ చర్యలు చేపడు తున్నామని తెలిపారు. ఎగువన ఉన్న ఎస్.ఆర్.ఎస్.పి., కడెం ప్రాజెక్టుల నుండి వరద నీటిని విడుదల చేయడంతో, జిల్లాలోని వాగులు, చెరువుల నుండి అదనంగా వరద నీటిని కలుపుకొని 8 లక్షల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోనికి ఇన్ ఫ్లో అవుతుందని తెలిపారు. వరద నీటి కారణంగా మొదట ప్రభావితమయ్యే మాత శిశు ఆసుపత్రి నుండి గర్భిణీలు, బాలింతలు, పిల్లలను ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల నుండి 27 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, నివాస ప్రాంతాలలో వర్షపు నీటి నిల్వలను తొలగించి, దోమల అభివృద్ధిని అరికట్టే దిశగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాలలో నీటి ట్యాంకుల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందని,



సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వాగులు, నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున సమీప ప్రాంతాలకు ఎవరు వెళ్లకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగిందని, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్/పంచాయితీ శాఖల సమన్వయంతో ప్రజా రక్షణ



చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో చేపల వేటకు ఎవరు వెళ్లకూడదని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలకు తక్షణ సహాయం, సమాచారం అందించేందుకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736- 250501 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు అందుబాటులో ఉంటూ తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు.

# విద్యార్థులు ఆరోగ్య పాఠశాలల కార్యక్రమంపై దృష్టి సారించాలి



**ఆదిలాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

ఆరోగ్యపరమైన అలవాట్లు చిన్న వయసులోనే అలవర్చుకోవడం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బోరజ్ మండలంలోని గిమ్మ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సమావేశంలో విద్యార్థులకు 6 ఆరోగ్య పాఠశాల అంశాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. శుభ్రత, పౌష్టికాహారం, వ్యాయామం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మానసిక, శారీరక ఆరోగ్యం మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ మానసిక వికాసానికి ప్రాధాన్యతలో భాగంగా ఆరోగ్యపరంగానే కాదు, వ్యక్తిత్వ వికాసం, మానసిక వికాసం కూడా విద్యార్థుల అభివృద్ధికి అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలో అభ్యాసించే ప్రతి విషయం, వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అవకాశంగా మారాలన్నారు. సానుకూల ఆలోచన, ఆత్మవిశ్వాసం, సామూహిక వ్యవహార శైలి వంటి అంశాలు మానసిక వికాసానికి మార్గం

### విద్యార్థులకు కలెక్టర్ రాజర్షిషా సందేశం



వేస్తాయని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని ఛాబ్రా, తహసిల్దార్ రాథోస్ రాజేశ్వరీ ప్రధానోపాధ్యాయులు పద్మజ, రిసోర్స్ పర్సన్ అజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఈవీఎం గోదామును
# తనిఖీ చేసిన కలెక్టర్

**నిర్మల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

కలెక్టరేట్ సమీపంలోని ఈవిఎం గోదామును శనివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. గోదాములో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ పరికరాలను పరిశీలించారు. ఈవిఎం భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయరాదని, గోదాములో 24 గంటల పహారా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఏవో సూర్యారావు, అధికారులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన
# రైతులను ఆదుకోవాలి

**ముథోల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

ముధోల్ మండలంలో నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పత్తి,మొక్కజొన్న పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని మాజీ జడ్పీటీసీ లక్ష్మి నర్సగౌడ్ అన్నారు. ప్రభుత్వం సర్వే చేయించి, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. వర్షంతో పలు గ్రామాల రహదారులు ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్లకు మరమ్మత్తులు చేయాలని కోరారు. గ్రామాల్లో ఇండ్లు కూలిపోయాయన్నారు. వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకోవాలని కోరారు.

## అభ్యంతరాలుంటే
# తెలియజేయాలి

**బెజ్జూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎంపిడీఓ ప్రవీణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు ఉన్నచో తెలియజేయవలసినదిగా కోరారు. చనిపోయిన వారి పేర్లు గ్రామాలు వదిలి వెళ్ళిన వారి పేర్లు తొలగించే విధంగా చూడాలని కోరారు. ఓటర్లు భార్య ఒక వార్డులో భర్త మరో వార్డులో వార్డుల వారిగా ఇలా తప్పిదాలు ఉంటే ఒకే వార్డులో చేర్చుకునేందుకు గ్రామ కార్యదర్శి వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 22 గ్రామ



పంచాయతీల సంబంధించిన ఓటర్ లిస్టులో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఇట్టి విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేస్తానని ఎంపిడిఓ పలు పార్టీల నాయకులకు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీఓ గౌరీ శంకర్, ఏపీవో రాజన్న పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్

**ఆసిఫాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

బిఎస్ఎన్ఎల్ సంస్థ సిమ్ కార్డులను ఒక రూపాయికే అందజేస్తూ నెలరోజుల వ్యాలిడిటీతో పాటు ప్రతిరోజు 2జీబీ డేటా అన్లిమిటెడ్ కాల్ చేసుకునే అవకాశం ఇస్తుంది. దీంతో సిమ్ కార్డు తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. నెలరోజుల వ్యాలిడిటీ అనంతరం 199 రూపాయలు రీఛార్జ్ చేస్తే నెలరోజుల వ్యాలిడితో పాటు ప్రతిరోజు 2జీబీ డేటా వస్తుందని బిఎస్ఎన్ఎల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఇంజనీర్ భీమ్ శంకర్, సిబ్బంది సత్యనారాయణ, రాజానంద్, రవికుమార్, సిహెచ్ సత్యనారాయణ ఉన్నారు.



# జీపీ కార్యాలయం భవనానికి భూమి పూజ

**మందమర్రి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

పులిమడుగు గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి మండల తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్‌లు భూమి పూజ నిర్వహించారు. శనివారం పులిమడుగు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన భవన నిర్మాణానికి వారు పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. త్వరలోనే కార్యాలయం నిర్మాణం పూర్తి చేసి గ్రామస్తులకు పూర్తిస్థాయిలో సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారా యణ, ఏపీఓ రజియా సుల్తానా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రామ్ చందర్, కాంగ్రెస్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నీలయ్య, రవి, మోహన్, శంకర్‌లు పాల్గొన్నారు.




# క్లిక్‌మనిపిస్తే.. కిటుకు చెబుతుంది

**సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది.. వ్యవసాయంలోనూ ప్రస్తుతం అనేక ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా సెల్‌ఫోన్ వచ్చాక ప్రతీది అరచేతిలోనే తెలిసిపో తోంది. పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు ఎలా చేపట్టాలో సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకునేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకు అనుగుణంగా స్మార్ట్ ఫోన్‌లో పంటల రక్షణ చర్యలపై ఎన్‌పీఎస్‌ఎస్ అనే ఆప్ విడుదల చేసింది.**

- పంటల్లో వ్యాప్తి చెందిన తెగుళ్లను తెలుసుకుంటుంది.. పరిష్కారాలు చూపుతుంది..
- చిత్రాలు పంపితే చీడపీడల గుర్తింపు
- ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్‌యాప్‌తో అనేక లాభాలు





**ముథోల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
పంటలను ఆశించే చీడపీడల నివారణకు సత్వర సలహాలు, సూచనలు పొందడానికి వీలుగా కేంద్రప్రభుత్వం ఓయాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయశాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్, స్టోరేజ్ కార్యాలయం, ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సహకారంతో నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం(ఎన్‌పీఎస్‌ఎస్) పేరిట జాతీయ చీడపీడల నిఘావ్యవస్థ అనే మొబైల్‌యాప్‌ను సిద్ధం చేసింది. దీన్ని రైతుల దరికి చేర్చే బాధ్యతను కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రానికి అప్పగించారు. కొంతమంది రైతులను ఎంపిక చేసివారికి మొబైల్‌యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

**చిత్రాలు పంపితే చీడపీడల గుర్తింపు..**
ఈ యాప్‌లో ప్రధానంగా మూడు విభాగాలు ఉన్నాయి. చీడపీడల గుర్తింపు విభాగం(పెస్ట్ ఐడెంటిఫికేషన్ మాడ్యూల్), చీడపీడల నిఘావిభాగం(పెస్ట్ సర్వైలెన్స్ మాడ్యూల్), సలహాల విభాగం (అడ్వైజరీ మాడ్యూల్) చీడీపీడల గుర్తింపు విభాగంలో 61పంటలకు సోకే చీడపీడలు, తెగుళ్లను గుర్తించవచ్చు. రైతు నేరుగా మొబైల్ ద్వారా పురుగు లేదా తెగుళ్ల చిత్రాన్ని తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే వెంటనే పురుగు లేదా తెగులును గుర్తించి దాని లక్షణాలు, చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యల సమాచారాన్ని అందజేస్తుంది. చీడపీడల నిఘా విభాగంలో ప్రస్తుతానికి వరి, పత్తి, సోయా, మిర్చి, మొక్క జొన్న, వంగ, దానిమ్మ, ఆపిల్, అరటి, ద్రాక్ష, మామిడి, కంది, చెరకు, టమాట, మినుము, గోధుమ పంటలలో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమాచారాన్ని సమోదు చేయవచ్చు. రాబోయే కాలంలో మిగిలిన పంటలను కూడా చేర్చే అవకాశామున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ విభాగంలో క్వాంటిటేటివ్, క్వాలిటేటివ్ అనే రెండు భాగాలున్నాయి. క్వాంటిటేటివ్ భాగంలో ఎంపికచేసిన రైతులకు యాప్ ఐడీ, పాస్‌వర్డ్‌ను అధికారులు అందజేస్తారు. వారు మాత్రమే ఈ భాగాన్ని ఉపయోగించవచ్చు. ఇక క్వాలిటేటివ్ భాగంలో ఐడీ, పాస్‌వర్డ్ అవసరం లేకుండానే ఉపయోగించే అవకాశం ఉంటుంది. ఇక మూడోది సలహాల విభాగంలో రైతుల ఎన్‌పీపీఎస్ వెబ్‌పోర్టల్ నుంచి నిపుణుల సలహాలను చూడవచ్చు.

**ప్రయోజనాలు ఇలా..**
◆ ఈ యాప్‌వల్ల సకాలంలో చీడపీడలను గుర్తించి నివారణకు సత్వర సమాచారాన్ని పొందవచ్చు. రైతులకు ఖర్చులు తగ్గి దిగుబడులు పెరిగి తద్వారా లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుంది.
◆ పురుగుల వ్యాప్తిని త్వరగా కనిపెట్టి నిరోధించ వచ్చు.
◆ ఒక ప్రాంతంలోని ముఖ్య పంటల్లో ఉన్న చీడపీడల చారిత్రక సమాచారం నమోదు ద్వారా రాబోయే రోజుల్లో పంటల సంరక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.
చీడపీడలు, తెగుళ్ల సమాచారం అందుబాటులో ఉంచడం ద్వారా విధానకర్తలు వ్యవసాయరంగానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది.

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి..**
చీడపీడల నివారణకు, సత్వర సలహాలు, సూచనలు పొందడానికి వీలుగా కేంద్రప్రభుత్వం ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చించి. అనేకపంటలలో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమా చారం ఈ యాప్‌లో ఉంటుంది. రైతు నేరుగా మొబైల్ ద్వారా పురుగు లేదా తెగుళ్ల చిత్రాన్ని తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే వెంటనే గుర్తించి దాని లక్షణాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల సమాచారాన్ని అందజేస్తుంది. రైతులు పండించే పంటల దిగుబడులు పెంచేందుకు అనుకూలమైన ఈ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.



## వరదతో నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలి

### బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్

**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
వరదతో నష్టపోయిన ప్రతి కుటుంబానికి నష్టపరిహారం కింద తక్షణమే రూ. 25 వేలు చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి ప్రభుత్వాన్ని కోరారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీరామ్‌సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్, రామ్ నగర్ లలో వరద నీరు ఇండ్లలోకి చేరడంతో శని వారం ఆ ప్రాంతాలను బీజేపీ నాయకులతో కలిసి సందర్శించి నీట మునగిన ఇండ్లను పరిశీలించి బాధిత ప్రజలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం వలన గత నాలుగు ఏండ్లుగా మంచిర్యాల పట్టణం బ్యాక్ వాటర్‌తో మునిగి ప్రజలు తీవ్ర నష్టపోయారన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మంచిర్యాల ఎమ్మెల్యే కరకట్టకు ఆరు నెలల కిందట శంకుస్థాపన చేసి ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభించలేదని విమర్శించారు. వరదతో ఇండ్లలోకి నీరు వచ్చి నష్ట పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే రూ. 25 వేలతో పాటు వారికి శాశ్వత ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమిరిశెట్టి రాజ్ కుమార్, ఎనగందుల కృష్ణ మూర్తి, జోగుల శ్రీదేవి, బియ్యాల సతీష్ రావు, మేడికొండ శ్రీనివాస్, బింగి ప్రవీణ్, సత్య నారాయణ, బియ్యాల సతీష్ రావు, జయ రామ రావు, అవిడపు రాజా బాబు, కంకణాల సతీష్, రాజబాబు, చిరంజీవి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకులలో వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించేందుకు ఫిజికల్ ఐడియాథాన్





### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువత, అధ్యాపకులలో వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇన్నోవేషన్ ఫర్ తెలంగాణ యూత్ (ఐ4టివై) 2.0, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఫిజికల్ ఐడియాథాన్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, టాస్క్ జిల్లా మేనేజర్ సాయికుమార్, ఐ4టివై ప్రాజెక్టు మేనేజర్ బాలు ప్రవరాఖ్య, హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి హాజరై ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా టట్లాడుతూ "సామాజిక ఆవిష్కరణలు - సరళమైన జీవితానికి" అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధిలో నూతన ఆవిష్కరణలు ప్రాధాన్యమని, ప్రజా ప్రయోజనకర ఆవిష్కరణల ద్వారా అవసరాలు సమకూర్చడంతో పాటు వనరులను పొదుపుగా వినియోగించుకోవచ్చని, సమాజానికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ద్వారా సృష్టించిన ఆవిష్కరణలను అమలు చేసే విధానాన్ని వివరించడం, ఆవిష్కరణలను అమలు చేయడం కొరకు చేపట్టవలసిన విధానాలను తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమని, ఇందులో ఎంపికైన ఆవిష్కరణలను రూపొందించిన ఆవిష్కర్తలకు 6 నెలలు శిక్షణ అందించి ప్రజాప్రయోజనకరంగా వ్యాపార అభివృద్ధికి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఉద్యోగం చేయడం కంటే ఉపాధిని సృష్టించి మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం మంచి అవకాశం అని తెలిపారు. ఈ కార్యక్రమానికి 160 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 140 మంది హాజరయ్యారని తెలిపారు. ఐడియాథాన్ కార్యక్రమంలో 18-35 సంవత్సరాల వయసు గల యువత, అధ్యాపకులు వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించేందుకు వినూత్న ఆవిష్కరణలను సిద్ధం చేసి వ్యవస్థాపక విద్య అభివృద్ధి చేసేలా కృషి చేయాలన్నారు. మంచిర్యాల జిల్లాకు చెందిన మిమ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు దినేష్ కార్తీక్ టీం తయారు చేసిన ప్రోటో టైపు ఆవిష్కరణలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవతోనే సమాజంలో గుర్తింపు

**కుభీర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
ఏ ప్రభుత్వ ఉద్యోగి కైనా ప్రజలతో మమేకమై ఉత్తమ సేవలు అందించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మండల ప్రత్యేక అధికారి శంకర్, ఎంపీడీవో సాగర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. శనివారం కుబీర్ లోని మండల పరిషత్ సమావేశం మందిరంలో 12 ఏళ్లుగా కుభీర్‌లో సేవలు అందించి ఈనెల 31న పదవి విరమణ చేస్తున్న ఎంపీ ఓ మోహన్ సింగ్ శాలువా, పూలమాలతో వేర్వేరుగా సత్కరించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగికి విరమణ సహజమే అయినప్పటికీ పని చేసిన చోట ప్రజల మన్నలను ఎంతవరకు అందుకున్నామనేది ప్రధానమని అన్నారు.



నీతి నిజాయితీకి మారుపేరుగా ఓపిక సహనం ఆయన సొంతమే అన్నట్లుగా అందరి తలలో నాలుకగా మోహన్ సింగ్ మండలానికి అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అనిల్, గంగా చరన్, ఏఎంసీ ఆత్మ చైర్మన్లు కళ్యాణ్, ఎంపీడీవో పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

**జన్నారం, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఎంపీడీవో ఉమర్ షరీఫ్, తహశీల్దార్ రాజ మనోహర్ రెడ్డి సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓట్ల జాబితాపై చర్చించారు. ఎన్నికల నిర్వహణపై అఖిల పక్షనాయకుల నుంచి అధికారులు సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులున్నారు.



# సీనియార్టీ ప్రకారం కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌ల బదిలీలు

**ఆదిలాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ మండలాలలో క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది అయిన కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌లు, మాస్టర్ బుక్ కీపర్‌లు, పారాలీగల్‌లు, మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్‌లకు శనివారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బదిలీల ప్రక్రియ చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లాలోని 17 మండలాల్లో పనిచేస్తున్న 107 మంది క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి వారు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం కాకుండా, వారి స్వంత క్లస్టర్ పరిధి కాకుండా వారి సీనియారిటీ ప్రకారం ఎంపిక చేసుకున్న స్థానాలకు అవకాశం కల్పిస్తూ బదిలీ ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది. ఈ కౌన్సెలింగ్‌లో ట్రైనీ కలెక్టర్ సలోని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా స్థాయిలో పనిచేసే ఏపీఎంలు పాల్గొన్నారు.







## ఘనంగా కనైలాల్ దత్త జయంతి వేడుకలు

**మందమర్రి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
భారత స్వాతంత్ర సమరయోధులు కనైలాల్ దత్త జయంతి వేడుకలను పట్టణంలో మాజీ ఆర్మీ జవాన్ దంపతులు రాజేష్ పివ్వల్, రాణి పివ్వాల్ లు ఘనంగా నిర్వహించారు. శనివారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కనైలాల్ దత్త చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ పివ్ హల్ మాట్లాడుతూ, 30 ఆగస్టు 1908 సం॥లో పశ్చిమ బెంగాల్‌లో జన్మించిన కనైలాల్ దత్త చిన్నతనం నుండే దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని యువతకు స్ఫూర్తిగా నిలిచాడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సేవ వెల్ఫేర్ సొసైటీ సంస్థ సభ్యులు సుద్దాల ప్రభుదేవ్, జనందిపాట రాజ్ కుమార్, జావిద్, శ్రీహరి, వలస శ్రీచరణ్, లావణ్య పాల్గొన్నారు.

## ఘనంగా సింగరేణి మహిళా కాలేజీ ప్రెషర్ డే వేలుకలు



**మందమర్రి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
మండలంలోని అందుగులపేట సింగరేణి బాలికల జూనియర్, మహిళా డిగ్రీ కాలేజీ లో ప్రెషర్ డే వేడు కలు అలరించాయి. శనివారం కళాశాలలో నిర్వహిం చిన ప్రెషర్ డే వేడుకలలో కాలేజీ డైరెక్టర్ హీరాలాల్ ఉపాధ్యాయ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థినులు ఉన్నత విద్యలో రాణించాలని కోరారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ చదువులో ముందుండి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కళాశాలలో సీనియర్లు, జూనియర్ల మధ్య ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా విద్యార్థినులలో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు ప్రెషర్ డే వేడుకలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు సీనియర్లను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

## ఆర్పీఐ(ఎ) జిల్లా కమిటీ రద్దు

**మందమర్రి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**



రిపబ్లిక్ ఆ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) మంచిర్యాల జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆర్పీఐ(ఎ) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగపిండి రమేష్ తెలిపారు. త్వరలో పార్టీ జిల్లా నూతన కమిటీని నియమిస్తామన్నారు. నూతన కమిటీ ఏర్పాటు అయ్యే వరకు పార్టీ పేరిట ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, పార్టీ నియమాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

## స్థానికేతరులను ఓటరు జాబితా నుండి తొలగించాలి



**మందమర్రి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
మండలంలోని 10 గ్రామ పంచాయతీల పరిధిలో పట్టణానికి చెందిన పలువురు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని వారిని గుర్తించి ఓటర్ జాబితా నుండి తొలగించాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీల నాయకులు తహసిల్దార్, ఎంపీడీవోలకు శనివారం వేరువేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పట్టణానికి చెందిన పలువురు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు గ్రామాలలో తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారని, స్థానికేతరులు అయినందున వారిని గుర్తించి ఓటర్ జాబితా నుండి తొలగించాలన్నారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బానోత్ నీలయ్య, మాజీ జెడ్పిటిసి బిఆర్ఎస్ మండల నాయకులు వేల్పుల రవి, బిజెపి మండల అధ్యక్షులు గిర్నాటి జనార్ధన్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్, రవి కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ కనబరిచినన విష్ణు

**మందమర్రి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన పేగంబరం విష్ణు నాలుగు పథకాలను సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విష్ణును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... జాతీయ స్థాయి ఐసిఎన్ బిల్డింగ్ కేటగిరీలలో జీకే ఫిట్నెస్ హబ్ యూని సెక్స్ జిమ్ శిక్షకుడు విష్ణు నాలుగు పథకాలను సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడన్నారు. యువత ఫిట్నెస్ పై దృష్టి సారించి భవిష్యత్తును బంగారు మయం తీర్చిదిద్దుకోవాలని కోరారు. అనంతరం పథకాల విజేత విష్ణు మాట్లాడుతూ పట్టణం లోని జీకే ఫిట్నెస్ హబ్ యూనిసెక్స్ జిమ్ వలననే ఫిట్నెస్ సాధించి బాడీ బిల్డింగ్‌లో పథకాలు సాధించానన్నారు.





## బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**లక్షెట్టిపేట, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
బాధితులు, ప్రజలు అందించే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ పోలీస్ అధికారులను సూచించారు. శనివారం పట్టణంలోని పోలీస్ అధికారులు పూలమొక్కలను డీసీపీకి అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిసిపి ఎ.భాస్కర్ మాట్లాడుతూ.... పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనీతీరును సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించినవి క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీ, డిసిలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతో పాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉంది అని అన్నారు.

## ఉత్తమ సేవలతో గుర్తింపు

**నిర్మల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖాధికారి పి. రామారావు పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా పాల్గొని రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అధ్వాన్నంగా మార్లవాయి రోడ్లు



**జైనూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామం అంటేనే తెలంగాణ రాష్ట్రంలో కాకుండా భారతదేశంలో పలుసార్లు ఆదర్శ గ్రామంగా అవార్డులు తీసుకున్న గ్రామం. అయితే ఈ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు గత 20 రోజుల క్రితం మార్లవాయి గ్రామంలో పర్యటించినప్పటికి అక్కడున్న సమస్యల పరిష్కారానికి నేటికి నోచుకోవడం లేదు. అధ్వానంగా మారిన రోడ్ల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుండెబ్బ మండల అధ్యక్షుడు మధురాజ్ మడావి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాలకు రోడ్లు దెబ్బతినడం, గుంతలు ఏర్పడటం, బురదమయం అవ్వడం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్లే రోడ్లు ఇలా అద్వాన్నంగా తయారవుతున్నాయని మధురాజ్ మడావి మండిపడ్డారు.

అయితే ఈ గ్రామమే కాకుండా ఉమ్మడి అదిలాబాద్ జిల్లా పలు ఆదివాసి ప్రాంతాల్లో కూడా ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధాన మార్గాలు ఇలా పలు రోడ్లు గుంతల మయంగా మారడమే కాకుండా వర్షపు నీటితో కరిగెటను తలపిస్తున్నాయి. దీంతో రోడ్డు మార్గాల్లో రాకపోకల సమయంలో వాహన చోదకులు, పాదచారులకు కిందపడి గాయాలు అవుతున్నాయని పట్టణవాసులు ఆవేదన చెందుతున్నారు. అసలు ఇది ఆదర్శ గ్రామమేనా? అని కొత్తగా వచ్చే వారు ముక్కున వేలేసుకోవడంతోపాటు అధికారుల తీరుపై తీవ్రంగా మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకొని గ్రామస్తుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

# 108, 102 వాహనాల వైద్య సేవలపై సమీక్ష



## సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి

**ఆదిలాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో పనిచేస్తున్న అత్యవసర వైద్య సేవల 108, 102 ప్రాజెక్ట్ వాహనాల పనితీరుపై జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్ సమీక్షించారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జిల్లా కోఆర్డినేటర్ రాజ శేఖర్ లతో కలిసి అత్యవసర వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల పనితీరును సమీక్షించి, రోగులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా వాహనాల హాట్‌స్పాట్ లొకేషన్లు, వాహనాల స్పందన సమయం, ఆసుపత్రికి చేరేవరకు ఇచ్చే ప్రాథమిక వైద్య సేవలు వంటి అంశాలను సమీక్షించారు. అంతేకాకుండా వాహనాల్లో ఉన్న మెడికల్ ఎక్విప్‌మెంట్, ఆక్సిజన్ సిలిండర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్ తదితర పరికరాల పనితీరును పరిశీలించారు. సమీక్ష అనంతరం జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో రోగి వద్దకు వేగంగా చేరుకొని వైద్య సహాయం అందించడం ద్వారా ఈ వాహనాలు అనేక ప్రాణాలను రక్షిస్తున్నాయని తెలిపారు. అలాగే డ్రైవర్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు చూపిస్తున్న అప్రమత్తత ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను ముందే అంచనా వేసి, అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నందుకు జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సమ్రాట్, జిల్లా మేనేజర్ రాజశేఖర్ సహకారం, కృషిని డీఎంహెచ్ఓ ప్రశంసించారు. కఠిన పరిస్థితుల్లో కూడా సమన్వయంతో పనిచేసి అత్యవసర సేవలను అంతరాయం లేకుండా అందించడంలో వారి పాత్ర విశేషమని గుర్తించారు. ప్రజలు అత్యవసర సమయంలో ఈ సేవలను మరింత విశ్వసనీయంగా వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ 108, 102 వాహనాల హెల్ప్‌లైన్ నంబర్లను తెలుసుకొని ఉపయోగించుకోవాలన్నారు.



## లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

### జూనియర్ సివిల్ జడ్జి కాసమల సాయి కిరణ్

**లక్షెట్టిపేట, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

వచ్చే నెల13 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో రాజీకి అనుకూలమైన కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు తగినంత కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సాయి కిరణ్ సూచించారు. శనివారం పట్టణంలోని న్యాయస్థానంలో న్యాయవాదులు, పోలీసులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సమయంతో పాటు ఆర్థికంగా కూడా కలిసి వస్తుందని అంతే కాకుండా పెండింగ్ కేసులకు పరిష్కారం దొరుకుంతుందని అవగాహన కల్పించారు. న్యాయస్థానం పరిధిలోని కేసుల సత్వర పరిష్కారానికి అందరూ సహకరించాలని న్యాయమూర్తి కోరారు.

## శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

**ఉట్నూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ లక్కారం గ్రామంలోని సర్వజనిక్ గణపతి విగ్రహాన్ని దర్శించి, ప్రజలు పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యమత్యాన్ని పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండప నిర్వాహకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**



సికింద్రాబాద్- నాగ్‌పూర్ మధ్య నడిచే వందే భారత్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్ లో హాల్టింగ్ కల్పించాలని రైల్వే బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ శనివారం మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లిల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ నాయకుల పోరాట ఫలితం వల్లనే మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలు హాల్టింగ్‌కు ఆమోదం లభించిందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో పలు మార్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రికి, రైల్వే బోర్డు చైర్మన్, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ లకు వినతి పత్రం ఇవ్వడం వల్లనే హాల్టింగ్ కు అవకాశం లభించిందన్నారు. రైలు హాల్టింగ్ తో సికింద్రాబాద్ నాగ్‌పూర్ వెళ్ళడానికి ప్రజలకు సులభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణ మూర్తి, వెంకటేశ్వర రావు, అశోక్, ముఖేష్ గౌడ్, రాజ్ కుమార్, చక్రవర్తి, కమలాకర్ రావు, సత్తయ్య, శ్రీదేవి, సురేఖ, ఉదయ్ శ్రీ, వైద్య శ్రీధర్, మహీధర్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టించుకోరు... పరిష్కరించరు..!



**బెల్లంపల్లి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలో ప్రధాన రోడ్లు అద్వాన్నంగా మారాయి. నిత్యం జల సంబంధంగా ఉండే రోడ్లే ఆస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఈ రోడ్లపై రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బెల్లంపల్లి పాత మున్సిపల్ కార్యాలయం నుండి కన్నాల బస్తీ ఫ్లైఓవర్ వరకు గల ప్రధాన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు గుంతలు నీటితోనుండి ప్రమాదకరంగా తయారయ్యాయి. పాత జీఎం కార్యాలయం ఎదుట గల గాంధీ విగ్రహం వద్ద రోడ్డు మృత్యకుహరంగా మారింది. కాంటా చౌరస్తా, టేకుల బస్తీ, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో గల ప్రధాన రహదారి పై భారీ గుంతలు ఏర్పడ్డాయి. గత కొన్నేళ్లుగా ఈ ప్రధాన రహదారి గుంతల మయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి అధ్వానంగా తయారైన ప్రధాన రహదారికి మరమ్మత్తులు జరిపించి ప్రజలను ప్రమాదాల బారి నుండి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళకు శిశు మందిర్ విద్యార్థులు

**ఆసిఫాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళకు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు సెప్టెంబర్ మూడు, నాలుగు, ఐదు తేదీలలో కామారెడ్డి పట్టణంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి విజ్ఞానమేళలో పాల్గొంటారు. మూడు జిల్లాలకు సంబంధించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత, శ్రీ సరస్వతీ విద్యా పీఠం జిల్లా అధ్యక్షులు బహుమతులు ప్రధానం చేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రబంధకారిణి సభ్యులు, ఆచార్యులు అభినందించారు. శిశువర్గ. వేస్ట్ మేనేజ్మెంట్ విభాగంలో ప్రథమ. చి,పోలంపల్లి. శార్వాని, బాలవర్గ. సంస్కృతి జ్ఞాన ప్రశ్నమంచ్ విభాగంలో ప్రథమ. వెంకటరత్న,చరణ్ సాకేత్,హరిచరణ్ సైన్స్ మాడల్. సుసైడ్ రిడెక్షన్ అంశంలో ప్రథమ. బొంతల దివ్య 8వ తరగతి మ్యాథ్స్ మాడల్ ప్రథమ. జశ్వంత్ 8వ తరగతి వాటర్ మేనేజ్మెంట్ విభాగంలో ద్వితీయ. శ్రీ నిహారిక 8వ తరగతి, విక్రమ్ ద్వితీయ సంస్కృతి జ్ఞాన ప్రశ్న మంచ్ ద్వితీయ. రేవంత్,సహస్ర, శ్రీనిధి నిలిచారు.

## బీజేపీ నాయకుల శ్రమదానం

**ఆసిఫాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో, సాలేగూడ గ్రామ పరిధిలో శనివారం, బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్ రావ్, మాజీ ఎంపిపి అరిగెల మల్లికార్జున్ యాదవ్‌లు శ్రమదానం ద్వారా రోడ్డు మరమ్మత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికంగా చెడిపోయిన రహదారి వల్ల ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, గుంతలు పూడ్చి రహదారిని ధృడంగా తయారు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని, అధికారులపై ఆధారపడకుండా శ్రమిస్తే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని వారు ఈ సందర్భంగా తెలిపారు.



# అధైర్య పడకండి ప్రభుత్వం ఆదుకుంటుంది: కాంగ్రెస్ పార్టీ నాయకులు

**లోకేశ్వరం, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల సుద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో పరివాహక గ్రామాలైన పుస్పూర్, బిలోలి, హద్గాం గ్రామాలకు చెందిన రైతుల పసుపు, పత్తి, సోయాబీన్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీనితో శనివారం ఆయన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాజనకంగా ఉన్న పంటలు కొట్టుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. చైర్మన్ తో పాటు పిఏసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, నాయకులు భోజన్న, ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.



# ఓటరు జాబితాలో అభ్యంతరాల స్వీకరణ

**వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అఖిల పక్ష సమావేశంలో అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరణ**



**ఆసిఫాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
గ్రామ పంచాయతీ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపైన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అఖిల పక్ష సమావేశం నిర్వహించి అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఆసిఫాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపైన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జూరు :** ఓటర్ల సవరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఓటరు జాబితాపై అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే వార్డులోని కుటుంబంలోని ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటర్ల నమోదులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఒక వార్డులోని కుటుంబ సభ్యుల ఓటర్లంతా ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకుంటామని ఇందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీవో గౌరిశంకర్, ఏపీవో రాజన్న, జూనియర్ అసిస్టెంట్ వసంత్, శ్రీవర్ధన్, తిరుపతి, వసీఖాన్, రాకేష్, దిగంబర్, రాజన్న, సురేష్‌గౌడ్, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

**దహెగాం :** దహెగాం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపైన పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేందర్ అభ్యంతరాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రవి, నాయకులు ధనుంజయ్, భీమన్న, వెంకటేష్, సంజీవ్, షాకీర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి :** మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పంచాయతీల ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపైన పలు రాజకీయ పార్టీల అఖిల పక్ష నాయకులతో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యంతరాలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో తో పాటు వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**సిర్పూర్(టి) :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై రాజకీ పార్టీల నాయకులతో ఎంపీడీఓ సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ మండలాలకు సంబం?ధించిన తుది ఓటరు జాబితాపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కోట ప్రసాద్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో వచ్చిన అభ్యంతరాలపై ఫిర్యాదులను స్వీకరించినట్టు తెలిపారు. ఆక్షేపణలపై సవరణలు తప్పకుండా చేస్తామన్నారు. సమావేశంలో పార్టీల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల సమస్యలపై
# గ్రామస్థుల ఆందోళన

**పంచాయతీ కార్యదర్శి పని తీరుపై ఎంపీడీఓకి పిర్యాదు**

**బేల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
బేల మండలంలోని ఖోగ్దూర్ గ్రామంలో మంజూరైనా 40 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. ఇందిరమ్మ ఇండ్ల ఫోటో కాప్చరింగ్ సంబంధిత పంచాయతీ కార్యదర్శి చేయక పోవడంతో గ్రామ మహిళలు బేలా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఇన్ని రోజులు ఫోటో కాప్చరింగ్ చేసిన పంచాయతీ కార్యదర్శి ఇప్పుడు ఎందుకు చేయడం లేదని అధికారులను నిలదీశారు. దీతంతో ఎంపీడీఓ మహేందర్ కుమార్ ఆందోళన కారులు వద్దకు వచ్చి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సోమవారం నుండి తానే స్వయంగా వచ్చి అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఇండ్ల ఫొటోస్ తీస్తానని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, పంచాయతీ కార్యదర్శి ఇతరుల మాటల విని ఫోటోలు తీయడం లేదని, కార్యదర్శి తమ తీరును మార్చుకోవాలని కోరారు.

# జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య ఆకాంక్షించారు. శనివారం మంచిర్యాల జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవాలు - 2025 పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని, అన్ని అంశాలలో నైపుణ్యాలు ప్రదర్శించాలని కోరారు. నైపుణ్యాలను ప్రదర్శించడానికి కళా ఉత్సవ పోటీలు ఒక చక్కటి వేదికని, ఉపయోగించుకొని విద్యార్థులు రాణించాలన్నారు.



**అలరించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు...**
జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు అందరిని అలరించాయి. ఆరు విభాగాలలో ఈ పోటీలు నిర్వహించగా జిల్లాలోని వివిధ యాజమాన్యాల కు చెందిన దాదాపు 350 మంది విద్యార్థులు అద్భుతమైన కళా ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శాంకరి ఆర్కే ప్రసాద్, రాజన్న, సుమన చైతన్య, భూపతి సంతోష్, జనార్ధన్, మూర్తిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, సెక్టోరల్ ఆఫీసర్ చౌదరి, జైపూర్ ఎంఈఓ శ్రీనివాస్, వివిధ పాఠశాలల విద్యార్థులు, గైడ్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పిర్యాదుల విషయంలో అధికా రులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గిడి భాస్కర్ అన్నారు. వా ర్షిక తనిఖీల్లో భాగంగా శనివారం లక్సెట్టిపేట ప ట్టణ పోలీస్ స్టేషన్‌ను శనివారం డీసీపీ తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ రిసిప్షన్‌తో పాటు క్రైమ్ వా హనాలు పరిసరాలు పరిశీలించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించిన డీసీపీ పోలీసు వి ధుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసులపై న మ్మకాన్ని కల్పించడంతోపాటు పోలీసుల పట్ల ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. ప్రతీ పోలీసు ఉద్యోగి మంచి నిబద్ధత, నిజాయితీతో పని చేయాలని పోలీసులకు వచ్చిన ఫిర్యా దులను మర్యాదపూర్వకంగా తీసుకోవాలన్నారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ తమకు ఏలాంటి సమస్యలు ఉన్న చెప్పాలని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.



## విద్యార్థులకు మెరుగైన
# విద్య అందించాలి

**అదనపు కలెక్టర్ దీపక్ తివారి**

**దహెగాం, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల గణిత బోధనపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తరగతి గదిలో బోర్డుపై విద్యార్థుల చేత గణితానికి సంబంధించిన ప్రశ్న రాసి సమాధాన్ని రాబట్టారు. విద్యార్థులు కష్ట పడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అదే విధంగా సెల్‌ఫోన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆయన వెంట సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు తదితరులు ఉన్నారు.

## కేకే ఓపెన్ కాస్ట్‌ను
# సందర్శించిన అధికారులు

**మందమర్రి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
మందమర్రి ఏరియాలోని కేకే ఓసిపి గనిని కొత్తగూడెం ఉన్నతాధికారులు సాయిబాబా, సూర్యరామ రాజు, రఘురామ రెడ్డి, రవి బృందం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ పనిచే యక పోవడం వలన ఒక్క షోవెల్, నాలుగు డంపర్, ఒక్క డ్రిల్ ఇవ్వడం జరిగిందని, దానికి అదనంగా ఒక్క షోవెల్, నాలుగు డంపర్, ఒక్క డోజర్ కూడా ఇస్తామని తెలిపారు. ఆఫ్టింగ్ కాంట్రాక్టర్ వచ్చిన తర్వాత కూడా డిపార్ట్మెంట్ ఎక్విప్మెంట్ ద్వారా కొంత భాగం తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజినీర్ వెంకట వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన డీసీసీ అధ్యక్షులు శ్రీహరి

**నిర్మల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో పలు మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. శనివారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు నిర్మల్ నియోజకవర్గంలోని లక్ష్మణ చందా మండలం మునిపల్లి, చింతల్ చాంద గ్రామాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. రైతులు ఎంతో కష్టపడి సాగు వేసిన వరి, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్ ఇతర పంటలు భారీ వర్షాలతో పూర్తిగా దెబ్బతిన్నాయని, వందల ఎకరాల్లో వరద నీరు చేరి పాడైపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలతో కరెంట్ సమస్యలు, రవాణా అంతరాయం, గ్రామీణ రహదారులు దెబ్బతినడం, గృహాలు కూలిపోవడం, పలు చెరువులు పొంగిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయని అన్నారు. శ్రీహరి రావు జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి స్థానిక పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్, అధికారులతో మాట్లాడి తక్షణమే పంటల నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల కష్టం వృథా కాకుండా ప్రభుత్వము తక్షణమే నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందిస్తుందని అన్నారు. సంబంధిత అధికార యంత్రాంగం పంటల పరిస్థితి పరిశీలించి, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మునిపెల్లి గ్రామంలో మహిళలతో మాట్లాడారు. ఉప్పొంగి ప్రవేశించిన గోదావరిలో చిక్కుకొని బయటకు వచ్చిన పశువుల కాపరి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఇందులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్



సోమ భీమరెడ్డి అబ్దుల్ ఆది మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేశ్వర్,మధుకర్ రెడ్డి, వేణుగోపాల్, సాగర్ రెడ్డి, భుజంగా శ్రీనివాస్ రెడ్డి,ఆత్మ చైర్మన్ రామ్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ ఉన్నారు.

# ఆరోగ్యమస్తు..!

## పోషకాలకు కేరాఫ్ చిరుధాన్యాలు..

సండే స్పెషల్

- గొప్పోళ్ల ఇళ్లలో పేదల రుచులు
- కొర్రలు, అర్కలు, సామలు, వరిగల, తైదలు, సజ్జలు, జొన్నలకు పెరుగుతున్న డిమాండ్



మనిషి మనుగడ కోసం ఒకనాడు గరీబులు మాత్రమే తిన్న తిండికి నేడు నవాబుగిరి దక్కుతుంది. ఆ నాడు ఆకలి తీర్చుకోవడం కోసం తింటే నేడు ఆరోగ్యం కాపాడు కోవడం కోసం సంపన్నులు తింటున్నారు. వరిగలు, అర్కలంటే అసహ్యించుకున్న వాళ్లు, కొర్రలు, సామలను చిన్నచూపు చూసిన వాళ్లు సైతం వాటి కోసం ఆరాటపడే పరిస్థితి ఏర్పడింది. అంబలి తాగటం నామోషీగా ఫీలైన వాళ్లు సైతం నేడు తైదల కోసం తంటాలు పడుతుంటే, రొట్టెల రుచిని ఆస్వాధించలేకపోయిన ఎందరో ఇప్పడు సజ్జలు, జొన్నల కోసం ఎగబడుతున్నారు. ఆనారోగ్యాలకు అవే ఔషధాలని తెలియడంతో మళ్లీ కాలచక్రం వెనుతిరిగింది. చిరుధాన్యాలను గూగుల్ లో వెతికి మరీ దొరకబుచ్చుకుని తింటున్నారు నేటి నవ సమాజం. రోజుకు గుప్పెడు మందు బిళ్లలు మింగినా నయం కాని రోగాలకు సహజసిద్ధ ఆహారమే దివ్యఔషధమని వైద్యులే స్వయంగా సలహాలు ఇస్తుండటంతో చిరుధాన్యాలు తినేవారి సంఖ్య పెరిగింది. ఇప్పడు సగటు మానవుని జీవన శైలిలో భాగమైన చిరుధాన్యాలపై ప్రభాత సమాచారం అందిస్తున్న ప్రత్యేక కథనం..

ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో ప్రధాన ఆహారం గింజ ధాన్యాలు అందులో వరి, గోదుమలను ధాన్యాలని కొర్రలు, అర్కలు, సామలు, వరిగలు, తైదలు, సజ్జలు, జొన్నలను చిరుధాన్యాలని పిలుస్తారు. చిరుధాన్యాలలో వరి, గోధుమకంటే అధిక రెట్లు పోషక విలువలు ఉంటాయి. మన శరీర అవసరాలకు సరిపడా పోషక శక్తిని అందించటంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వరిలో కంటే కూడా ప్రోటీన్లు, పీచు పదార్థలతో పాటు కాల్షియం, ఇనుము, మెగ్నీషియం వంటి ఖనిజ లవనాలు విటమిన్లు అధికంగా ఉంటాయి. చిరు ధాన్యాలలో పీచు పదార్థం అధికంగా ఉండటం వలన నెమ్మదిగా జీర్ణం కావడంతో పాటు అదే స్థాయిలో శక్తిని విడుదల చేస్తాయి. అధికంగా శ్రమించే శక్తిని సైతం అందిస్తాయి. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా ఇవి కాపాడుతాయి. వరితో పోలిస్తే సామలలో ఐరన్ 13రెట్లు అధికంగా ఉండగా, రాగులలో 5రెట్లు ఎక్కువగా ఉంటుంది. చిరుధాన్యాలు వాడటం వలన షుగర్ ఒబేసిటీ (అధిక బరువు), గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి రోగాలు దరిచేరకుండా ఉంటాయి. రోగ నిరోధక శక్తి పెంచి, రక్తహీనతను తగ్గిస్తుంది. ఒక గ్లాసు రాగులలో ఉండే కాల్షియం రెండు గ్లాసుల పాలలో సమానం. దీంతో ఎముకలు దంతాలు ధృడంగా అవుతాయి. అంతేగాక చిరుదాన్యాలు రక్తప్రసరణను నియంత్రిస్తాయి. రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. కాలం మారుతున్నా.. ఆహార నియమాలు ఎంతగా మారినా.. గతకాలపు రుచులే తిరిగి వేదికలవుతున్నాయి. ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతున్నాయి.



### 100 గ్రాముల గింజలలో లభించే పోషకాలు గ్రాముల్లో...

| చిరు ధాన్యాలు | మాంస కృత్తులు | పీచు పదార్థం | కొవ్వు పదార్థం | పిండి పదార్థం | శక్తి | కాల్షియం | ఐరన్ | మెగ్నీషియం | బీ విటమిన్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| జొన్న | 10.4 | 1.6 | 1.9 | 72.6 | 349 | 25 | 4.1 | 17.1 | 0.38 |
| సజ్జ | 11.8 | 3.3 | 4.8 | 67 | 363 | 42 | 11 | 00 | 0.38 |
| రాగి | 7.3 | 3.6 | 1.3 | 72 | 329 | 350 | 3.9 | 137 | 0.42 |
| సామ | 7.7 | 7.6 | 4.7 | 67 | 341 | 17 | 9.3 | 133 | 0.03 |
| కొర్ర | 12.3 | 8 | 48 | 60.1 | 332 | 31 | 2.8 | 81 | 0.59 |
| అర్క | 8.3 | 5.2 | 1.4 | 65.9 | 353 | 35 | 1.7 | 00 | 0.00 |
| వరిగలు | 12.5 | 2.2 | 2.9 | 0.0 | 356 | 14 | 0.8 | 00 | 0.00 |
| వరి | 6.8 | 0.2 | 0.5 | 78.2 | 345 | 33 | 1.8 | 90 | 0.41 |

### కొర్రలతో షుగర్ కంట్రోల్...



దాదాపు నలభై ఏళ్ల క్రితం పేద వాళ్లు విరివిగా వాడిన కొర్రలు కాలక్రమేణ కను మరుగయ్యాయి. వరి పంట మను గుడలోకి రావడంతో అంతరించి పోయాయి. కానీ ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో ఈ కొర్రలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి గిరాకీ ఏర్పడింది. కొర్రలను అన్నం, జావ పాయసంలాగా వండుకుని తినొచ్చు. ఇవి కొంచెం వగరుగా, గరుకుగా ఉంటాయి. వీటిలో వేడి స్వభావం ఉంటుంది. కాబట్టి మజ్జిగతో కలిసి తినడం శ్రేయస్కరం. మధుమేహాన్ని అదుపులో ఉంచే లక్షణం ఉండటంతో పాటు వాపు, కఫం తగ్గించటం, క్యాన్సర్ వంటి ప్రాణంతాక వ్యాధిని దరి చేరనివ్వకుండా కాపాడుతుంది. వంద గ్రాముల కొర్రల్లో 12 గ్రాముల ప్రోటీన్లు, 8గ్రాముల ఫైబర్, 6.8గ్రాముల కొవ్వు, 3గ్రాముల ఇనుము, 10గ్రాముల మినరల్స్, 31గ్రాముల కాల్షియం, 473 గ్రాముల క్యాలరీస్ ఉంటాయి.

### శ్రమజీవుల ఆహారం జొన్న

పల్లే, పట్టణం తేడా లేకుండా శ్రమజీవుల నిత్య ఆహారపు అలవాట్లలో జొన్నరొట్టెది ప్రత్యేక స్థానం. వ్యవసాయ పనులకు చేసేవారు ఉదయం రొట్టెలు కొంచెం అన్నం తిని అలసిపోకుండా రోజంతా పనిచేయగలిగే శక్తి ఉంటుంది. జొన్నలు బలాన్ని, వీర్యవృద్ధిని కలిగించడంతో పాటు గుండె జబ్బులు ఉన్నవారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. జొన్నల్లో ప్రోటీన్లు 10.4 గ్రాములు, కొవ్వు 3.1గ్రాములు, పీచు పదార్థం 2గ్రాములు, ఐరన్ 5.4గ్రాములు, మినరల్స్ 1.6గ్రా, కాల్షియం 25మి.గ్రా, క్యాలరీస్ 329 గ్రాములు ఉంటాయి.



### త్వరిత శక్తికి అర్కలే ఔషధం..

గ్లూకోజ్ మాదిరిగా తిన్న వెంటనే శరీరానికి శక్తిని అందిచటంలో అర్కల అన్నం ప్రధాన ప్రాత పోషిస్తుంది. వీటిని జావలా చేసుకుని తినాలి. అర్కల్లో అమైనోఆసిడ్‌లు అధికంగా ఉంటాయి. దీంతో రక్తనాళాలు పూడుకపోయిన సందర్భలలో రక్తంలోని కొవ్వును కరిగించడంలో అర్కలు ఔషధంగా పని చేస్తాయి. ఇందులో ప్రోటీన్లు 8.3 గ్రాములు, కార్బోహైడ్రేడ్స్ 65.9 గ్రాములు, కొవ్వు 1.4 గ్రాములు, ఫైబర్ 5.2గ్రా, ఫాస్పరస్ 188మి.గ్రా, ఐరన్ 5.4 గ్రాములు, మినరల్స్ 1.7 గ్రా, కాల్షియం 35మి.గ్రా, క్యాలరీస్ 353 గ్రాములు ఉంటాయి.



### వీర్యవృద్ధి, దేహపుష్టికి రాగులు..

పేదోడి అకలిదప్పులను తీర్చటంతో తైదలు(రాగులు)ది నేటికి ప్రత్యేక స్థానమే. మిగతా చిరుధాన్యాలు కాలక్రమంలో కనుమరుగు అయినప్పటికీ తైదలు నేటికి గ్రామీణుల ఆహారపు అలవాట్లలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాగులతో అంబలి, రొట్టెలు చేసుకోవడంతో పాటు ప్రస్తుతం జావగా కాసుకుని తాగుతున్నారు. తైదలు కేవలం ఆకలిదప్పులను తీర్చటమే గాక వీర్యవృద్ధి, దేహపుష్టిని కలిగిస్తాయని పలు పరిశోధనల్లో తేలింది. అంతేగాక బరువు తగ్గించడంలో ఎముకలకు బలాన్ని చేకూర్చటంలో ప్రధానంగా ఉపయోగపడతాయి. వెంట్రుకలకు బలాన్ని ఇస్తాయి. రక్తహీనత, మలబద్ధకాన్ని దరిచేరనివ్వవు. రుచికోసం అంబలిలో మజ్జిగ కలుపుకుని సేవించడం గానీ, చక్కెర వేసుకుని జావ కాసుకుని తాగితే చాలా బాగుంటుంది. చలువ కోసం వేసవి కాలంలో రాగుల వంటకాలకు పల్లెలో ప్రాధాన్యత ఇస్తుంటారు. ప్రతి వంద గ్రాముల రాగులలో ప్రోటీన్లు 7.3గ్రాములు, కొవ్వు 1.3గ్రాములు, పీచు పదార్థం 3.9గ్రాములు, ఐరన్ 3.9గ్రాములు, మినరల్స్ 2.7గ్రా, కాల్షియం 25మి.గ్రా, పాస్ఫరస్ 28 మీ.గ్రాములు, కార్బోహైడ్రేడ్స్ 72గ్రాములు, క్యాలరీస్ 336గ్రాములు ఉంటాయి.



### సామలతో దీర్ఘాయుశు..



ప్రకృతి సహజంగా లభించే చిరుధాన్యాలలో సామలు ఒకటి. సామలు తినటం వలన నిత్య నూతనంగా ఉత్తేజంగా ఉంటారు. పూర్వం రోజుల్లో ఇవి తిన్నవాళ్లు ఇప్పటికి బలంగా ఎలాంటి ఆనారోగ్యం దరి చేరకుండా జీవిస్తున్నారు. పళ్లు ఊడటం, జుట్టు నెరపటం, కీళ్ల నొప్పుడు లేకుండా ఆరోగ్యంగా జీవిస్తున్నారు. సామలతో వండే అన్నం చూడాటానికి చమురుగా, తింటుంటే తియ్యగా కాస్తా వగరుగా ఉంటుంది. జీర్ణశక్తిని పెంపొందించడంలో సామలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇందులో పీచు పదార్థం, ఖనిజ లవణాలు అధికంగా ఉండటం వలన నరాల బలహీనత క్యాన్సర్ వంటి రోగాలను దరి చేరనివ్వవు. కఫం, పైత్యాలను హరించే లక్షణాలతో పాటు మలబద్ధక సమస్యలను సైతం దరి చేరదు. సామలలో ప్రోటీన్లు 7.7గ్రా, ఫైబర్ 7.9గ్రా, కొవ్వు 5.2గ్రా, ఇనుము 9.3 గ్రా, మినరల్స్ 1.5గ్రా, కాల్షియం 17గ్రాములు, క్యాలరీస్ 207 గ్రాముల చొప్పున ఉంటాయి.



### వరిగలతో కొలెస్ట్రాల్‌కు చెక్..

అధిక కొవ్వు, బరువుతో సతమతం అయ్యే వారికి వరిగలు ఒక వరం. చిరుధాన్యాలలో వరిగలది ప్రత్యేక రుచి. వరి, గోధుమలతో పోలిస్తే వరిగలలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. పిండి పదార్థం చాల తక్కువగా ఫాస్పరస్ అధికంగా ఉండటంతో పాటు కాల్షియం, ఐరన్ సమానంగా ఉంటాయి. తినటానికి ఎంతో రుచికరంగా ఉండే ఈ వరిగలకు జ్వరాలు రాకుండా చేసే గుణంతో పాటు మూత్రపిండాల్లో రాళ్లు రాకుండా కాపాడతాయి. వరిగల్లో ప్రోటీన్లు 12.5గ్రాములు, కొవ్వు 2.9గ్రాములు, ఫైబర్ 2.2గ్రాములు, ఐరన్ 0.8గ్రాములు, మినరల్స్ 1.9గ్రా, కాల్షియం 14మి.గ్రాములు, క్యాలరీస్ 350గ్రాములు ఉంటాయి.



### బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు సజ్జలు..

జొన్నలతో పాటు సాధారణంగా పండించే పంటల్లో సజ్జలు ఒకటి. సజ్జ పిండితో సంక్రాతి రోజు రొట్టెలు చేసుకోవడం తెలుగు ప్రజల సంప్రదాయం. తినటానికి రుచిగా ఉండే సజ్జలు స్త్రీలలో సంక్రమించే బ్రెస్ట్ క్యాన్సర్‌ను నివారిచడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. టైప్2 షుగర్‌ను నియంత్రిచటంలోనూ, ఎముకలకు పటుత్వాన్ని ఇవ్వడంలోనూ ఉపకరిస్తాయి. ఇందులో బీ కాంప్లెక్స్ విటమిన్, కాల్షియం కూడా అధికంగా ఉంటుంది. వీటిలో కార్బోహైడ్రేడ్స్ 6గ్రాముల, ప్రోటీన్లు 11.8 గ్రాములు, కొవ్వు 5గ్రాములు, మినరల్స్ 2.2గ్రాములు, పీచు పదార్థం 2.3గ్రాములు, కాల్షియం 62మీ. గ్రాములు, ఐరన్ 11 మీ.గ్రా, క్యాలరీస్ 363 గ్రాముల చొప్పున ఉంటాయి.

# గోదావరి జలతాండవం





- నీటమునిగిన బాసర
- పెరిగిన గోదావరి నీటి మట్టం
- ఎగువ ప్రాంతం నుంచిగోదావరికి వదర ఉధృతి
- జలదిగ్బంధంలోనే బాసర పుణ్యక్షేత్రం
- ఇంట్లో నుంచి తెప్పలపై బయటకు వస్తున్న జనం







**ముథోల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

ఎగువన భారీ వర్షాతో బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరద పెరడంతో బాసర పట్టణం జలదిగ్బంధమైంది. సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వ్యాస మహర్షి గుడి, ఆలయ ఆవరణలోని టీటీడీ గృహాల వరకు వరద చేరింది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు లాడ్జ్‌లు, సత్రాలు, పుష్కరఘాట్ నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే దారి నీటమునిగాయి. గోదావరిపై వంతెనను తాకుతూ వరద ప్రవహిస్తుండటంతో గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, వైశ్య సత్రం వరకు బ్యాక్ వాటర్ చేరాయి. అక్షర కాలనీలో వరద నీటిలో చిక్కుకున్న వారిని అధికారులు ట్రాక్టర్ల సహాయంతో తరలించారు. వరద చుట్టుముట్టడంతో నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు చిక్కుకున్నారు. దీంతో వారంతా భవనంపై అంతస్తుకు వెళ్లారు. దీంతో వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లిన 8 మంది కూడా వరద నీటిలో చిక్కుకుపోయారు. కాగా, మరికొన్ని గంటల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలు విస్తారంగా కురవటంతో పాటు మహారాష్ట్రలో వర్షాలు భారీగా కురిసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడి ప్రాజెక్టులు నిండిపోయాయి. ఈ క్రమంలో ప్రాజెక్టుల గేట్లు త్తివేయడంతో గోదావరి ఉధృతంగా గత మూడు రోజులుగా ప్రవహిస్తోంది. ఆలయ పరిసరాల వరకే శుక్రవారం నీళ్లు చేరిన విషయం తెలిసిందే. శనివారం వరకు వరద ఉధృతి పెరగడంతో జ్ఞాన సరస్వతి ఆలయ ముందర ఉన్న వ్యాస మహర్షి ఆలయం వరకు, అలాగే రెండవ ఆలయ అర్చిగేటు వరకు, ఇటు గోదావరి నుండి వంద గదుల భవనం వరకు భారీగా వరద నీరు చేరింది. ఉదృతి పెరగటంతో స్థానికులు ఆందోళన చెందారు. గత మూడు రోజులుగా ఆలయ పరిసరాల్లో ఉన్న లాడ్జిలు, నివాస గృహాలు, ఆలయం ముందరన్న వ్యాపార దుకాణాలు నీట మునిగాయి. తాజాగా శనివారం మరింత ఉధృతి పెరగటంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి స్థానికులు మత్సకారుల సహకారంతో తెప్పలను ఉపయోగిస్తున్నారు. ఇంటి సరుకులు తేవటానికి కుడా తెప్పలను ఉపయోగించుకుంటున్నారు. దీనికి తోడు ఆలయ పరిసరాల్లో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు నీట మునగాయి. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడానికి ఎస్డిఆర్ఎఫ్ బృందాల సహాయంతో వెళ్ళి విద్యుత్ సిబ్బంది విద్యుత్‌ను నిలిపివేశారు. దీంతో నీట మునిగి, ఇంట్లో ఉన్నావారు నీటి సమస్యను ఎదుర్కుం టున్నారు. ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలతో అక్కడి ప్రాజెక్టులు నిండిపోవడంతో విడతల వారిగా గేట్లు ఎత్తివేయడంతో గోదావరి ఉధృతి రోజురోజుకూ పెరుగుతోంది. ఉధృతి ఆదివారం వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

**కిర్గుల్ (బి) పంటలను పరిశీలించిన అదనపు కలెక్టర్**

రెండు రోజులుగా బాసర వద్ద గోదావరి నది ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో శనివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గోదావరి నదిని పరిశీలించారు. సంబంధిత అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయంలోని వసతి భవనంలో ఆయా అధికారులతో వరదలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవకు కాంగ్రెస్, బిజెపి పార్టీ నాయకులు ఈట మునిగిన పంట పొలాలను సర్వే చేసి పంట నష్ట పరిహారం అందించాలని వినతిపత్రం అందజేశారు. కిర్గుల్ (బి) పంట పొలాలను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ రైతులతో కలిసి ట్రాక్టర్ పై వెళ్లి పరిశీలించారు. అధికారులు సర్వే చేసి నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందే విధంగా చూస్తానని అదనపు కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.

# భక్తి మార్గంతోనే శాంతి, సౌభ్రాతృత్వం

## మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస రావు



**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
భక్తి మార్గంతోనే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటుందని మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల రోడ్డులో గల అంజనీ పుత్ర సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గణ నాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ ఒక్కరూ భక్తి మార్గంలో పయనించి సమాజంలో మార్పు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజ సేవ కోసం శక్తి వంచన లేకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం అంజనీ పుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవిలతో కలిసి భక్తులకు ప్రసాదం వడ్డించి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం, డైరెక్టర్ లు, సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**నిర్మల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
ఎస్సారెస్పీ దిగువన గోదావరి నది ప్రాంతంలో వరద నీరు వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి రైతులకు భరోసా కల్పించారు. శనివారం సోను మండలంలోని వివిధ గ్రామాలను సందర్శించి పంటలను పరిశీలించి నష్టపోయిన రైతు వివరాలను ప్రభుత్వ సర్వే నిర్వహించి తప్పకుండా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్మాజీ రాజేందర్ కృష్ణ ప్రసాద్ రెడ్డి వినోద్ కుమార్ మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై బీఆర్ఎస్ నిరసన



**తాండూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
శనివారం తాండూరు తహశీల్దార్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నాయకులు యూరియా కొరతపై నిరసన తెలిపారు. నయబ్ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నడూ యూరియా కొరత లేదని, కానీ కాంగ్రెస్ ఇరవై నెలల పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతను తీర్చి సరిపడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## 11వ రోజుకు చేరిన రిలే దీక్షలు




**తాండూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
తమ సమస్యల పరిష్కారం కోరుతూ తాండూరు మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ఆదివాసులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం పదకొండోరోజుకు చేరుకున్నాయి. నర్సాపూర్ గ్రామ పంచాయితీలో బీమన్న వాగుపై హై లెవల్ బ్రిడ్జి, లచ్చుగుడెం వద్ద వంతెన నిర్మాణం, బెజ్జల బీటీ రోడ్డుకు అటవీ శాఖ అనుమతి మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఆదివాసులు కోరుతున్నారు.

## గుడుంబా పట్టివేత
## ముగ్గురిపై కేసు నమోదు

**ఆదిలాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలో గుడుంబా అక్రమ మద్యంపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నప్పటికీ రోజురోజుకు ఎక్కడో ఒకచోట అక్రమంగా గుడుంబా ను కాస్తూనే ఉన్నారు. శనివారం బోథ్ మండలంలోని బాబేర, నిగిని, కంటిగాం గ్రామాలలో విశ్వసనీయ సమాచారం మేరకు గుడుంబా స్థావరాలపై బోథ్ పోలీసులు రైడ్ చేసి పలువురును పట్టుకున్నారు. సబ్ ఇన్స్పెక్టర్ సాయి తెలిపిన వివరాల ప్రకారం... బాబేర గ్రామానికి చెందిన రాథోడ్ ఉత్తమ్, నిగిని గ్రామానికి చెందిన ఆడె గన్ను, కంటెగాం గ్రామానికి చెందిన ఆడె దత్తు అనే వ్యక్తులు క్రమంగా గుడుంబా కలిగి ఉన్నారని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైనా గుడుంబా కలిగి ఉన్న, తయారుచేసిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

## దివ్యాంగుల గుర్తింపు శిబిరంలో డీఈఓ




**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
దివ్యాంగులకు అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవా లని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య కోరారు. శనివారం మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ సమగ్ర, శిక్ష, కేంద్ర ప్రభుత్వ సంస్థ, అలీంకో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల ఉపకరణాల గుర్తింపు శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు పలు సలహాలు, సూచనలు చేశారు. జిల్లాలోని 11 మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించగా 105 విద్యార్థులు హాజరు కాగా ఉపకరణాలకు 94 మంది దివ్యాంగులు ఎంపికయ్యారన్నారు. హాజరుకాని వారు సెప్టెంబర్ ఒకటిన బెల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే శిబిరానికి హాజరుకావచ్చునన్నారు.



## స్వచ్ఛ పాఠశాలలకు రేటింగ్

**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
పచ్చదనం-పరిశుభ్రత ఆధారంగా పాఠశాలకు రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఎస్‌హెచ్‌వీఆర్ కార్యక్రమంపై నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలలో పరిశుభ్రత, పచ్చదనం, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో మీరిచ్చే రేటింగ్ తెలియజేస్తుందన్నారు. రేటింగ్ ద్వారా పాఠశాలలు కేవలం శుభ్రతలోనే కాదు, పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, శానిటేషన్, విద్యార్థుల ఆరోగ్య భద్రత అంశాలలోనూ ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి పాఠశాల తప్పనిసరిగా సెప్టెంబర్ 15లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కోరారు. 2021లో స్వచ్ఛ విద్యాలయాలుగా ఎంపికైన పాఠశాలు కూడా జిల్లాలో ఉన్నాయని, అదే స్ఫూర్తితో 2025లో జరుగుతున్న ఈ రేటింగ్స్‌లో కూడా మన జిల్లాలోని పాఠశాలలు రాష్ట్రస్థాయిలోనూ, జాతీయస్థాయిలోనూ అవార్డులు పొందేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్స్ చౌదరి, సత్యనారాయణమూర్తి, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజగోపాల్, రిసోర్స్ పర్సన్స్ దత్త కుమార్, హరిప్రసాదలు పాల్గొని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు రిజిస్ట్రేషన్ విధానం, మొబైల్ యాప్/వెబ్ పోర్టల్ ద్వారా వివరాలు ఎంట్రీ చేయడం, 60 సూచికల ఆధారంగా స్వీయ అంచనా ప్రక్రియ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.



## ఓటరు జాబితా సవరణకు
## గడువును పెంచండి

**కుభీర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
కుభీర్ మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జీపీ కార్యాలయాల్లో ప్రదర్శించిన ఓటరు జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని సెప్టెంబర్ 2 వరకు సవరించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువును సెప్టెంబర్ 10వ తేదీ వరకు పెంచాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు ఎన్నిల అనిల్, ఉద్యమకారుడు, మండల పార్టీ సీనియర్ నాయకుడు పుప్పాల పీరాజీ, టౌన్ అధ్యక్షుడు గిరి పోశెట్టిలు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాగర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో అనేక తప్పులు దొర్లాయని.. మరణించిన వారి పేర్లను తొలగించకపోవడంతోపాటు ఒక వార్డులోని కుటుంబ సభ్యుల పేర్లు వేర్వేరు వార్డుల్లో నమోదయ్యాయని తెలిపారు. పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు వార్డు సభ్యులుగా పోటీలో నిలిపేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. హడావిడిగా జీపీలలో ఓటరు జాబితాలు ప్రదర్శింపజేసి దొంగ ఓట్లకు ఆస్కారం కల్పించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం వ్యూహాత్మకంగానే జాబితా తప్పుడు తడకలుగా తయారు చేసిందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ చొరవ చూపి ఓటర్ జాబితాలో తప్పులను సవరించేందుకు మరో పది రోజులు గడువు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.



## పాఠశాలను సందర్శించి..
## పాఠాలు బోధించి

**పెంచికల్‌పేట్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి శనివారం సందర్శించి విద్యార్థులకు గణితం బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి పలు అంశాలను వివరించారు. అలాగే మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, భోజన శాల పరిసరాల పరిశుభ్రత, రిజిస్టర్లను పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు, ప్రహరి గోడ సదుపాయాలు కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజనంలో పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు అందించే విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజన తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని చెప్పారు. వంట సమయంలో శుభ్రత పాటించాలని, విద్యార్థులకు శుద్ధమైన తాగనీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు


**నా భర్త రమేష్‌తో నాకు ప్రాణహాని ఉంది**
**తన భర్త రమేష్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడు**

**ఆసిఫాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, భర్త రమేష్‌తో నాకు ప్రాణహాని ఉందని, అందుకే ఇంటినుంచి వెళ్లిపోయానని మమతా శనివారం విడుదల చేసిన ఓ వీడియో ద్వారా మీడియాకు తెలిపింది. కుటుంబ సభ్యులతో తీవ్ర గొడవ జరిగిందని, భర్త రమేష్ తనను చితకబాదగా ఓ ఫ్రెండ్ సహాయం ఇంటికి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రస్తుతం సోషల్ మీడియా, వార్త పత్రికల్లో తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు.



## బిగ్ బాస్‌లోకి దివ్వెల మాధురి

బుల్లితెర ఆడియన్స్ కి బోలెడంత ఫన్, ఎంటర్‌టైన్మెంట్ అందించే బిగ్గెస్ట్ రియాలిటీ షో బిగ్ బాస్ మరో కొత్త సీజన్‌తో సిద్ధమైంది. ఇప్పటి వరకు 8 సక్సెస్ ఫుల్ సీజన్లు పూర్తి చేసుకున్న ఈ షో.. ఇప్పుడు 9వ సీజన్స్ తో అలరించనుంది. వచ్చేనెల అంటే సెప్టెంబర్ 7 నుంచి సీజన్ 9 ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బిగ్ బాస్ కి సంబంధించిన చర్చలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా షోలో పాల్గొనబోయే కంటెస్టెంట్స్ గురించి రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారి కంటెస్టెంట్స్ జాబితాలో రాజకీయ నేపథ్యం ఉన్న ప్రముఖ వ్యక్తి పేరు కూడా వినిపించడం హాట్ టాపిక్ గా మారింది. ప్రముఖ రాజకీయ నాయకుడు దువ్వాడ శ్రీనివాస్ సతీమణి దివ్వెల మాధురి బిగ్ బాస్ సీజన్ 9 లో పాల్గొంటున్నారని ప్రచారం జరుగుతోంది. బోల్డ్ పర్సనాలిటీ, వివాదాస్పద వ్యాఖ్యలతో తరచుగా వార్తల్లో నిలుస్తుంటారు దివ్వెల మాధురి. అంతేకాదు తన అభిప్రాయాలను కూడా ఎంతో బలంగా, ముక్కుసూటిగా చెబుతుంటారు. గతంలో చాలా సందర్భాల్లో ఆమె వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఇలాంటి స్వభావం ఉన్న వ్యక్తి బిగ్ బాస్ ఇంట్లోకి వస్తుండడంతో షో మరింత వేడెక్కనున్నట్లు నెటిజన్లు అనుకుంటున్నారు. అయితే దివ్వెల మాధురి ఎంట్రీ గురించి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. కాకపోతే సోషల్ మీడియాలో మాత్రం బాగా వైరల్ అవుతోంది. ఒకవేళ దివ్వెల మాధురి నిజంగానే బిగ్ బాస్ హౌస్ లోకి వస్తే.. ఆమె ఎలా ఉండబోతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ప్రేక్షకులు.




## ఎన్టీఆర్ 'డ్రాగన్' కథలో అదిరిపోయే ట్విస్ట్..

ప్రస్తుతం టాలీవుడ్ సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఎన్టీఆర్ 'డ్రాగన్' ఒకటి. కేజీఎఫ్, సలార్ వంటి బ్లాక్ బస్టర్స్ అందించిన ప్రశాంత్ నీల్ ఈ సినిమాను తెరకెక్కిస్తుండడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఎన్టీఆర్ కెరీర్ లోనే అత్యుత్తమ సినిమాగా 'డ్రాగన్' తీయాలనే ప్లాన్ చేస్తున్నారట ప్రశాంత్ నీల్. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో అప్డేట్( NTR Dragon Updates ) నెట్టింట వైరల్ గా మారింది. 'డ్రాగన్' లో ఎన్టీఆర్ పాత్రపై ఒక పవర్ ఫుల్ ఫ్లాష్ బ్యాక్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. సెకండ్ ఆఫ్ లో ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్ తో పాటు ఎమోషనల్ సీక్వెన్సెస్ కూడా ఉంటాయట.. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ పాత్ర పై ఒక ఫ్లాష్ బ్యాక్ ఉంటుందని సమాచారం. దీని ప్రకారం.. ఈ సినిమాలో రెండు విభిన్నమైన కథాంశాలు ఉండబోతున్నాయని తెలుస్తోంది. ఒకటి ప్రస్తుతానికి సంబంధించిన కథ కాగా, మరొకటి ఫ్లాష్ బ్యాక్ కథ. అయితే ఫ్లాష్ బ్యాక్ లో ఎన్టీఆర్ పాత్ర మాఫియా నేపథ్యంలో చాలా పవర్ ఫుల్ గా ఉంటుందట. ఈ పాత్ర కోసం తారక్ తన శరీర ఆకృతి, బాడీ లాంగ్వేజ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారట. ఇతర సినిమాల మాదిరిగా కాకుండా.. ఈ సినిమాలో ఫ్లాష్ బ్యాక్ స్టోరీ బిన్నంగా ఉండబోతుందట. సాధారణంగా మిగతా సినిమాల్లో ఫ్లాష్ బ్యాక్ అనేది కేవలం హీరోకు సంబంధించిన గతాన్ని చూపించేదిగా ఉంటుంది. కానీ, ఇందులో కథ ప్రధానంగా ఉండబోతుందట. ఈ ఫ్లాష్ బ్యాక్ లోని కథే ప్రధాన కథకు మూలమని తెలుస్తోంది. RRR తర్వాత ఎన్టీఆర్ నుంచి వచ్చిన దేవర, వార్ 2 ఆశించిన స్థాయిలో సంతోష పెట్టలేకపోయాయి. దీంతో ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ పై భారీ అంచనాలు పెట్టుకున్నారు తారక్ ఫ్యాన్స్. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఎన్టీఆర్ ప్రాజెక్ట్ తో పాటు ప్రభాస్ 'సలార్ 2' కూడా చేస్తున్నారు ప్రశాంత్ నీల్. ప్రస్తుతం ప్రభాస్ రాజా సాబ్, కల్కి షూటింగ్స్‌తో బిజీగా ఉండడంతో నీల్ ఎన్టీఆర్ ప్రాజెక్ట్ పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే తారక్ 'డ్రాగన్' షూటింగ్ సగభాగం పూర్తయినట్లు సమాచారం.

## అప్పుడు నో... ఇప్పుడు టాప్!



సరిగ్గా పదేళ్ల క్రితం సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన 'రేయ్' సినిమాతో సయామీ ఖేర్ నటిగా తెలుగు ప్రేక్షకులకు మాత్రమే కాకుండా మొత్తం ఇండస్ట్రీకి పరిచయం అయిన విషయం తెల్సిందే. మొదటి సినిమా తెలుగులో చేసిన ఈ అమ్మడికి పెద్దగా గుర్తింపు రాలేదు. రేయ్ సినిమా కొంతలో కొంత సాయి ధరమ్ తేజ్‌కి గుర్తింపు తెచ్చి పెట్టింది. కానీ కమర్షియల్‌గా ఫ్లాప్ కావడంతో సయామీ ఖేర్ కి పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. దాంతో తెలుగులో ఆఫర్లు కష్టం అయ్యాయి. తెలుగు ఫిల్మ్ మేకర్స్‌ను ఈమె సంప్రదించేందుకు ప్రయత్నించినా తిరస్కరణకు గురి అయింది. ఆ సమయంలో బాలీవుడ్‌లో చిన్నా చితకా సినిమాల్లో నటించే అవకాశం దక్కించుకుంది. అయితే అక్కడ కూడా పెద్దగా గుర్తింపు దక్కలేదు. తెలుగులో మరోసారి వైల్డ్ డాగ్, హైవే సినిమాలతో అవకాశాలు దక్కాయి. ఆ సినిమాలు కూడా సయామీ ఖేర్ కు హిట్‌ను తెచ్చి పెట్టలేదు. దాంతో మొత్తానికి సయామీ ని టాలీవుడ్ తిరస్కరించి, ఆమెకు ఆఫర్లు నో అంటూ చెప్పేసింది. టాలీవుడ్ నో చెప్పడంతో అప్పటికే పరిచయం ఉన్న బాలీవుడ్‌లో రీ ఎంట్రీకి సిద్ధం అయింది. 2023లో ఈమె 8 ఏఎం మెట్రో అనే సినిమాలో నటించింది. ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా ఈమెకు నటిగా గుర్తింపు తెచ్చి పెట్టింది. అదే ఏడాది మరో సినిమాతో సయామీ ఖేర్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈసారి అభిషేక్ బచ్చన్ తో కలిసి చేసిన స్పోర్ట్స్ డ్రామా ఆకట్టుకుంది. అంతే కాకుండా నటిగా మరింత మంచి పేరును తెచ్చి పెట్టింది. అక్కడ నుంచి ఈమె జోరు పెరుగుతూ వస్తోంది. ఏడాదికి రెండు సినిమాల చొప్పున ఈమె చేస్తోంది. గత ఏడాది ఈమె నటించిన రెండు హిందీ సినిమాలు విడుదల అయ్యాయి. అందులో అగ్నితో మంచి పేరును సొంతం చేసుకోవడంతో మరిన్ని ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటికే జాట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన జాట్ సినిమాలో ఎస్ఐ పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమాలోని సయామీ ఖేర్ నటనకు మంచి స్పందన దక్కింది. అందుకే ఇప్పుడు ఏకంగా బాలీవుడ్ మోస్ట్ క్రేజీ మల్టీస్టారర్ మూవీలో నటించే అవకాశం దక్కింది. అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ హీరోలుగా రూపొందబోతున్న సినిమాలో హీరోయిన్‌గా సయామీ ఖేర్ కు ఛాన్స్ దక్కింది. ఇప్పటికే ఆమెను ఎంపిక చేసినట్లు సమాచారం అందుతోంది. ఇంతటి క్రేజీ మల్టీస్టారర్ మూవీలో ఈమెకు చోటు దక్కడంతో ఖచ్చితంగా ముందు ముందు బాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా మారుతుంది అనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. 17 ఏళ్ల తర్వాత అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ నటిస్తున్న నేపథ్యంలో ఈ సినిమా పై బాలీవుడ్ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. సయామీ ఖేర్ ఫ్యామిలీ ఇండస్ట్రీ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారు కావడంతో ఈజీగానే ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. ముఖ్యంగా తండ్రి అద్వైత్ ఖేర్ సుదీర్ఘ కాలం పాటు మోడల్‌గా చేశారు. దాంతో ఇండస్ట్రీలో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. ఇక తల్లి సైతం మోడలింగ్‌లో ఉంది. 1980 ల్లో చాలా అందాల పోటీల్లో గెలిచి ఉత్తర ఖేర్ మంచి గుర్తింపును దక్కించుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సయామీ ఖేర్ కు మొదట్లో టాలీవుడ్ నుంచి తిరస్కరణ ఎదురైంది, అక్కడ నో చెప్పడంతో బాలీవుడ్‌లో అడుగు పెట్టడం, అక్కడ కూడా ఓపికగా సినిమాలు చేయడంతో ఇప్పుడు సయామీ ఖేర్ కెరీర్ స్పీడ్ అందుకుంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన పదేళ్ల తర్వాత ఒక బిగ్ ప్రాజెక్ట్ ను సయామీ ఖేర్ దక్కించుకుంది. రాబోయే పదేళ్లు ఈమెను ఆపే వారే ఉండరేమో అని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.




## యూత్ ని ఆకట్టుకుంటున్న 'జిగ్రీస్' సాంగ్..

'మ్యాడ్ స్క్వేర్' ఫేమ్ రామ్ నితిన్, కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా ప్రధాన పాత్రలో నటించిన యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ 'జిగ్రీస్'నుంచి ఫస్ట్ సింగిల్ "తిరిగే భూమి" పాటను విడుదల చేశారు. స్నేహితుల నేపథ్యంతో సాగిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కమ్రాన్ మ్యూజిక్, లిరిక్స్ ఫ్రెష్‌గా, పాజిటివ్ వైబ్స్ ఇస్తున్నాయి. ఈ పాటను యంగ్ హీరో కిరణ్ అబ్బవరం లాంచ్ చేశాడు. ప్రస్తుతం కిరణ్ K Ramp షూటింగ్ బిజీగా ఉన్నప్పటికి యంగ్ టాలెంట్ ఎంకరేజ్ చేయాలనే ఉద్దేశంతో తానే స్వయంగా పాటను రిలీజ్ చేసేందుకు ముందుకొచ్చారట. అలాగే చిత్రబృందానికి తన బెస్ట్ విషెష్ తెలియజేశారు. అంతేకాదు ఇప్పటికే టీజర్ చూడగా.. తనకు బాగా నచ్చిందని, సినిమా తప్పకుండా మంచి సక్సెస్ అవుతుందని నమ్ముతున్నట్లు తెలిపారు.



## గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**బజార్‌హత్నూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

బజార్‌హత్నూర్ మండలంలోని టెంబి గ్రామ శివారులో అక్రమంగా ఓ వ్యవసాయ భూమిలో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వరరావు, బజార్ హత్నూర్ ఎస్ఐ సంజయ్ కుమార్ తెలిపారు. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు బజార్‌హత్నూర్ ఎస్సై, సిబ్బంది టెంబి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ భూమిలో తనిఖీలు చేయగా.. గంగాపూర్ గ్రామానికి చెందిన బాలేరావు అనిల్ అక్రమంగా వ్యవసాయ భూమిలో 60 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడు. వీటి విలువ సుమారు ఆరు లక్షల రూపాయల వరకు ఉంటుందని అన్నారు. అక్రమంగా గంజాయి సాగు చేస్తుండడంతో బాలేరావ్ అనిల్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అక్రమంగా ఎవరైనా గంజాయి సాగు చేసినా, తరలించిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు.

### గుడుంబా స్థావరాలపై దాడులు

## 10 మందిపై కేసులు నమోదు

**41 లీటర్ల గుడుంబా స్వాధీనం : ఏఎస్పీ వెల్లడి**



**ఉట్నూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ సబ్ డివిజనల్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా పటిష్టమైన పోలీసు చర్యలను చేపడుతున్నట్లు ఉట్నూర్ ఏఎస్పి కాజల్ సింగ్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఉట్నూర్ డివిజన్‌లోని 4 మండలాలలో ఏకకాలంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 10 బృందాలుగా ఏర్పడిన సిబ్బంది విశ్వసనీయ సమాచారం మేరకు గుడుంబా కేంద్రాలపై దాడులు చేయగా, నాలుగు మండలాలలో వివిధ గ్రామాలకు చెందిన పది మంది పై కేసులు నమోదు చేసినట్లు వారి వద్ద నుండి దాదాపు 41 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుడిహత్నూర్ మండలంలో రాథోడ్ రమేష్, రాథోడ్ రోహిదాస్, రాథోడ్ కృష్ణ ఆడే లక్ష్మి, సిరికొండ మండలంలో రాథోడ్ శేషారావు, చంద్రకాంత్, చౌహాన్ రామకృష్ణ, నార్నూర్ మండలంలో రాథోడ్ సకారం, రాథోడ్ శ్రీనివాస్, నేరేడిగొండ మండలంలో జాదవ్ సానుబాయిలను అరెస్టు చేశారు.

## భీమన్న ఆలయంలో చోరీ

**సోన్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కూచన్పల్లి గ్రామ సమీపంలో ఉన్న న్యాకపు కులస్తుల ఆరాధ్య దైవమైన భీమన్న ఆలయంలో గురువారం చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై గోపి సంఘటన స్థలానికి చేరుకుని ఆలయ పూజారి దేశి నరును అడిగి తెలుసుకున్నారు. 40 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2వేల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆన్‌లైన్ ఆటకు బానిసై.. ఖాతాదారుల డబ్బులు కొల్లగొట్టి

- ఎస్‌బీఐ బ్యాంకు కుంభకోణానికి బెట్టింగ్ కారణం..
- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసగా మారిన క్యాషియర్
- బ్యాంకులోని సొమ్ము ఆన్‌లైన్ ఆటలో పెట్టిన ఘనుడు
- వందలాది మంది కుటుంబాల్లో ఆందోళన
- పైగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు
- ముత్తూట్ ఫైనాన్స్‌లో పోలీసుల విచారణ
- మంచిర్యాలలోనూ పలు గోల్డ్‌లోన్ ఫైనాన్స్‌లు, వడ్డీ వ్యాపారులను విచారిస్తున్న పోలీసులు
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు




**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

చెన్నూర్ ఎస్‌బీఐ బ్రాంచి-2లో ఇటీవల జరిగిన ఆభరణాలు, నగదు కుంభకోణంలో పోలీసుల విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నట్లు విశ్వసనీయ సమచారం. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన బ్యాంకు క్యాషియర్ రవీందర్ ఆ తర్వాత ఆట వ్యసనంగా మారినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లో పెద్దఎత్తున లాభం వస్తుందని ఆశపడి క్రికెట్‌తోపాటు ఇతర ఆన్‌లైన్ ఆటలు ఆడి కోట్లాది రూపాయలు పోగొట్టుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బ్యాంకు క్యాషియర్ రవీందర్‌తో సంబంధాలున్న 40మందిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. బ్యాంకులో రూ.12.61 కోట్లు విలువైన బంగారు ఆభరణాలు, రూ.1.10కోట్లు సదరు క్యాషియర్ కాజేసి ఖాతాదారులకు శఠగోపం పెట్టిన విషయం తెలిసిందే. ఈ కేసును ఛేదించేందుకు పోలీసులు గత రెండు రోజుల నుంచి మంచిర్యాలలోని ఎనిమిది ప్రైవేటు గోల్డ్‌లోన్ ఫైనాన్స్‌ల్లో విస్తృతంగా సోదాలు చేస్తున్నట్లు తెలిసింది. శుక్ర, శనివారాల్లో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 16 నుంచి 17 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మరికొంత బంగారాన్ని రికవరీ చేసేందుకు ప్రైవేటు బ్యాంకుల్లో సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాంకులో 20కిలోల బంగారు ఆభరణాలు గల్లంతు కాగా పూర్తి స్థాయిలో రికవరీ చేసేందుకు పోలీసులు నిమగ్నమయ్యారని సమాచారం. బ్యాంకులో పెద్దమొత్తంలో డబ్బును ఖాతాల్లోకి క్యాషియర్ బదిలీ చేసినట్లు గుర్తించి ఈ నెల 23న అధికారులు ఫిర్యాదు చేశారు. వారితోపాటు మరో 30 ఖాతాల్లోకి డబ్బులు బదిలీ అయినట్లు నిర్ధారించి వారిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రధాన నిందితుడు క్యాషియర్‌తో పాటు సుమారు 40మంది వరకు అదుపులో ఉన్నట్లు తెలిసింది. కాగా క్యాషియర్ నిర్వాహకం కారణంగా బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్న సుమారు 402మంది కుటుంబాల్లో అలజడి నెలకొంది.

**ముత్తూట్ ఫైనాన్స్‌లో పోలీసుల విచారణ**

చెన్నూర్ పాతబస్టాండ్ సమీపంలోని ముత్తూట్ ఫైనాన్స్ పోలీసులు శనివారం విచారణ జరిపారు. 400గ్రాముల బంగారం తాకట్టు పెట్టినట్లు గుర్తించినట్లు తెలిసింది. కేసులోని అనుమానితుడు ఇచ్చిన సమాచారం మేరకు కోటపల్లి సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో ఎస్సైలు శ్యామల్, రాజేందర్ బృందం విచారణ నిర్వహించింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌బీఐ గోల్డ్‌లోన్ బాధితులు ఫైనాన్స్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. తమ బంగారు నగలు ఇవ్వాలని బైఠాయించారు. సోమవారం ఇస్తామని ఫైనాన్స్ అధికారులు లిఖితపూర్వకంగా ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మంచిర్యాలలోనూ ముత్తూట్ ఫైనాన్స్ ఎదుట చెన్నూర్ గోల్డ్‌లోన్ బాధితులు ఆందోళన చేపట్టారు. ఇదిలా ఉండగా చెన్నూర్ ఎస్‌బీఐ బ్యాంకు క్యాషియర్‌గా పని చేసిన రవీందర్ బ్యాంక్‌లో ఖాతాదారులకు అందించిన సేవలకు గాను ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నాడు. బంగారం, నగదు కాజేసి అటు బ్యాంకుకు ఇటు ఖాతాదారులకు శఠగోపం పెట్టడంతో అంతా కంగుతిన్నారు.

## సంతానం కలుగడంలేదని ఉపాధ్యాయురాలు ఆత్మహత్య

**కౌటాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**



సంతానం కలుగడంలేదనే మనస్తాపంతో ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లగౌడ్‌తోటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మిడిదొడ్డి కవిత (41)కు ఐదేళ్ల క్రితం చరణతో వివాహమైంది. సదరు ఉపాధ్యాయురాలు కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ సంతానం కలుగకపోవడంతో పాటు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆరోగ్యం నయం కాకపోవడంతో పాటు సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందింది. శుక్రవారం రాత్రి భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరేసుకుంది. బయట నుండి వచ్చిన భర్త పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి అన్న రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత




**తాండూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

మండలంలోని మాదారం సమీపంలోని మూతబడిన గని ఎంవికె త్రీ ఇంక్లైన్ బంకర్ వద్ద ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సింగరేణి బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్ తెలిపారు. బంకర్ వద్ద ఉన్న మట్టిని ట్రాక్టర్లలో లోడ్ చేస్తుండగా అటువైపుగా వెళ్ళిన మొబైల్ టాస్క్ ఫోర్స్, సింగరేణి ఎస్ అండ్ పిసి సిబ్బందిని చూసి డ్రైవర్లు ట్రాక్టర్లను వదిలిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నించారు. సిబ్బంది వారిని చాకచక్యంగా పట్టుకొని మూడు టాక్టర్లను మాదారం పోలీస్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ ఇన్స్పెక్టర్ రాజమౌళి, స్పెషల్ టీం సిబ్బంది సార్ల రమేష్, శ్రీనివాస్, సిహెచ్ అనిల్ కుమార్, దశరథ్, ప్రైవేట్ సిబ్బంది రాయలింగు, వెంకటేష్ పాల్గొన్నారు.

## మార్కెటింగ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**



మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమాయక ప్రజలను అధిక లాభాల ఆశ చూపి మోసం చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఉట్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయవాడకు చెందిన ఠాగూర్ విజయ్ సింగ్ అప్లికేషన్‌లో నమోదై దాని ద్వారా డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపి, అందులో నమోదయ్యేందుకు రూ.1,21,000 చెల్లించాలని ఇద్దరికి ఆశ చూపి మోసం చేశాడన్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఇంకా ఈ అప్లికేషన్ ద్వారా మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చన్నారు.

### భార్యాభర్తల మధ్య గొడవ

## భర్తకు తీవ్ర గాయాలు

**బెల్లంపల్లి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**



భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో భర్త గాయపడ్డ ఘటన బెల్లంపల్లి మండలంలోని చిన్న భూదే గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. భీమిని మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన మాదాసు రాజేష్(30) అనే వ్యక్తి చిన్న భూదే గ్రామానికి చెందిన తోట శైలజ అనే యువతని పదేళ్ల క్రితం వివాహం చేసుకుని ఇల్లరికం ఉంటున్నాడు. శనివారం అతిగా మద్యం సేవించి తనను బూతులు తిడుతూ ముఖంపై పిడి గుద్దులు గుద్దాడని, కర్రతో చావ బాదేందుకు ప్రయత్నించగా తన తండ్రి తోటరాములు అడ్డుకున్నాడని శైలజ తెలిపింది. ఇదే క్రమంలో తన భర్త రాజేష్ తాగిన మత్తులో అదుపుతప్పి ఇంటి ఎదురుగా ఉన్న రోడ్డుపై పడడంతో తలకు గాయాలై రక్తస్రావమైనట్లు ఆమె తెలిపింది. పదేళ్ల నుండి తన భర్త నిత్యం తాగి వచ్చి నరకం చూపిస్తున్నాడని శైలజ పోయింది. గాయపడి రాజేష్ ను స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.కాగ్ భార్య శైలజ తీరుపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## కొండ చిలువ పట్టివేత

**కడెం, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**



మండలంలోని చిట్యాల్ గ్రామంలోని జనావాసాల్లో శనివారం కొండ చిలువ కనిపించడంతో గ్రామస్తులు భయందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు నల్ల రాంరెడ్డి.. కొండ చిలువను పట్టుకుని సమీప ఆటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు పాములు ఇళ్లలోకి వస్తున్నాయని చెబుతున్నారు.



# వరద నష్టం నివారణ చర్యలు త్వరితగతిన చేపడతాం

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**సోన్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఏర్పడిన వరద నష్టాలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం సోన్ మండలంలో పర్యటించారు. ఇటీవల వర్షాల కారణంగా ప్రభావితమైన ప్రదేశాలను పరిశీలించిన కలెక్టర్, ప్రజలు, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల వలన జరిగిన నష్టాలను అధికారులు ఇప్పటికే నష్ట నివారణ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. పంట నష్టం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశుకాపరులు, చేపలు పట్టేవారు జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబరు 9100577132ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసిల్దార్ మల్లేష్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ తరలిన మాల మహానాడు నాయకులు

**మందమర్రి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
హైదరాబాదులో నిర్వహిస్తున్న జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ సమావేశానికి జిల్లా మాల మహానాడు నాయకులు శనివారం తరలి వెళ్లారు. హైదరాబాద్‌లోని బోరబండలో జరుగుతున్న రాష్ట్ర కమిటీ సమావేశానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవు తున్నారని వారు తెలిపారు. సమావేశాల్లో భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని నాయకులు తెలిపారు. కాగా తరలి వెళ్ళిన వారిలో మంచిర్యాల జిల్లా మాల మహానాడు అధ్యక్షులు గజ్జెల్లి లక్ష్మణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాల్తపు శంకరయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్, రాష్ట్ర నాయకులు బొజ్జ శరత్, జిల్లా కార్యదర్శి నాగుల దుర్గయ్య, జైపూర్ మండల అధ్యక్షులు శీలం వెంకటేష్, మందమర్రి పట్టణ అధ్యక్షులు దాసరి రామన్న, పట్టణ యూత్ అధ్యక్షులు దాసరి అనిల్, రమేష్ ఉన్నారు.



## పందులతో ప్రాణాలు పోతున్నాయ్



**దిలావర్‌పూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
తమ ఊరిలో ఊర పందులతో ప్రాణాలు పోతున్నాయని, తమ పిల్లలకు వ్యాధులు వస్తున్నాయని, అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన దిలావర్‌పూర్ గ్రామస్తులు శనివారం ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఉదయం 9 గంటలకే చేరుకుని గేటు ఎదుట భైఠాయించారు. అధికారులను కార్యాలయాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. నిర్మల్ కలెక్టర్ రావాలని నినాదాలు చేశారు. గ్రామం నుంచి పందులను తరలించే వరకు కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. దాదాపు మూడు గంటలకు పైగా ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ ఏజాజ్ హమ్మద్‌ఖాన్ చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడారు. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్, ఇతర మండల అధికారులకు వినతిపత్రం అందించారు.

## బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



**ఆదిలాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
గిరిజన మహిళా రైతు మృతికి కారకు లైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సాత్నాల మండలం పలాయి తండా వాసులు శనివారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసుల సమాచారంతో వారి వద్దకు వచ్చిన ఆర్డీవో స్రవం తికి సమస్యను వివరించారు. గ్రామానికి చెందిన చౌహాన్ కమలబాయి సర్వేనంబర్ 102లో ఆరెక రాల వ్యవసాయ భూమిని 1986లో ఇతర కులస్తుల వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. అయితే ఆ భూమి విక్రయించిన వ్యక్తి మనుమండ్లు ఆరుగురు అది తమ భూమి అంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో ఆర్ఎస్ఐ, సర్వే యర్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండా సదరు రైతును విచారించేందుకు వచ్చారు. దీంతో భయాందోళనకు గురైన రైతు బ్రెయిన్‌స్ట్రోక్కు గురై మృతి చెందినట్లు తెలిపారు. అధికారుల అత్యుత్సాహంతోనే రైతు మృతి చెందినట్లు ఆరోపించారు. బాధిత కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్రేషియాతో పాటు భూమిని సాగు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లంబాడా జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



## ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి

### సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

**ఖానాపూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ యోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో అసెంబ్లీ స మావేశాల అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఉట్నూర్‌లోని బీఈడి కాలేజీలో బోధన బోధన సిబ్బందిని నియమించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే బీఈడీ కళాశాలలో బోధన సిబ్బంది నియమించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. కడెం ప్రాజెక్టుపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల భారీ వర్షాలతో నష్టపోయిన పంటలు, కోతకు గురైన రోడ్ల గురించి కలెక్టర్ల ద్వారా నివేదికను తయారు చేసి పంపాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వర్ష ప్రభావం ఉన్న ప్రాంతాల్లో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవాని సూచించినట్లు తెలిపారు.

## గణనాథుడినికి కలెక్టర్ దంపతుల పూజలు

**ఆదిలాబాద్, ఆగస్టు 29 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలోనే ఎత్తైన వినాయక విగ్రహాల్లో ఒకటైన ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్ జనతా మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టించబడిన 54 అడుగుల ఎత్తైన గణనాథుని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యే పూజలు నిర్వహించారు.



# విద్యను వ్యాపార సరుకుగా మార్చారు

## ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శ్రీకాంత్



**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**
విద్యను వ్యాపార సరుకుగా మార్చారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శ్రీకాంత్ అన్నారు. శనివారం స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు మంచిర్యాల మార్క్స్ భవనంలో ప్రారంభించి జెండాను ఎగురవేశారు, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు అమరవీరుల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. లక్ష్మీ నారాయణలు ఉపన్యాసాలు చేశారు. విద్యను వ్యాపార సరుకుగా మార్చారని, ఎన్ఎస్ఈపీ ద్వారా వర్ణవ్యవస్థ ఆధారిత విద్యను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నేతలు ఆరోపించారు. దేశంలో 10 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా జీడీపీలో కేవలం 2.5 శాతం మాత్రమే విద్యకు కేటాయించడం తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రంలో 5వేలపైగా పాఠశాలలకు మరుగుదొడ్లు లేకపోవడం, వేల పాఠశాలలకు విద్యుత్తు, కాంపౌండ్ వాల్స్ లేని పరిస్థితిని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో విద్యకు 15శాతం బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని మండిపడ్డారు. విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఎన్ఎస్ఈపీ, యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని, అసెంబ్లీలో ఎన్ఎస్ఈపీ వ్యతిరేక తీర్మానం ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఐఎఫ్టియు జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, పీడీయోస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లాల్ కుమార్, పీడీఎస్యూల జాతీయ, రాష్ట్ర నాయకులు మహేష్, మధు, రాజేశ్వర్, కిరణ్, గౌతమ్ కుమార్, మస్తాన్, నవీన్, అజయ్, తిరుపతి, శ్రీను, రాణా ప్రతాప్, అలాగే జిల్లాల నుండి వచ్చిన విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.









## పూలాజీ బాబా ప్రవచనాలు

# ధ్యాన బోధలు స్ఫూర్తిదాయకం

- బాబా బోధనలు రాబోయే తరాలకు అందించాలి
- పార్లమెంటు సభ్యులు నగేష్, కలెక్టర్ వెంకటేష్ దొత్రే
- ఘనంగా పూలాజీ బాబా జయంతి వేడుకలు
- వేలాది తరలిచ్చిన బాబా భక్తులు
- పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు
- వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం
- ఆధ్యాత్మిక మార్గాలపై ఎగ్జిబిషన్ స్టాళ్ల ఏర్పాటు
- భక్తులకు మహా అన్నదానం

**జైనూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

శ్రీశ్రీశ్రీ సద్గురు పూలాజీ బాబా ప్రవచనాలు, ధ్యాన బోధలు స్ఫూర్తిదాయకమని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్ అన్నారు. శనివారం జిల్లాలోని జైనూర్ మండలం పాట్నాపూర్ గ్రామంలో గల సిద్దేశ్వర సంస్థాన్ లో నిర్వహించిన పూలాజీ బాబా 101వ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా ఎస్. పి. కాంతిలాల్ సుభాష్, కిన్వాట్ నియోజకవర్గ శాసనసభ్యులు భీమ్ రావు కేరం, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, సంఘాల నాయకులతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఎంపీ తోపాటు జిల్లా కలెక్టర్ ఎస్పీ ప్రజాప్రతినిధులు నాయకులు ఉద్యోగులు భక్తులు ప్రజలు పాల్గొని పులాజి బాబా సమాధి మందిరంలో ప్రత్యేక పూజలు చేసి బాబా ఆశీస్సులు పొందారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ బాబా చూపిన మార్గంలో తాను 1994 నుండి రాజకీయాల్లో వచ్చినప్పటికీ సద్గురు పులాజి బాబా ఆధ్యాత్మిక ధ్యాన బోధనలు చూస్తున్నారని ఆయన తెలంగాణ రాష్ట్రంలో కాకుండా మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల్లో ఆయన ప్రవచనాలు బోధనల వల్ల ఎన్నో కుటుంబాలు ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నాయని అన్నారు. సమాజంలో అన్ని వర్గాలను ఏకతాటిపై చర్చి ఆధ్యాత్మిక సన్మార్గాన్ని చూపిన మహనీయులని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దొత్రే మాట్లాడుతూ పులాజి బాబా మన జీవితాల్లో మార్పు రావాలని చేసిన ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఆ మహనీయులు బోధించిన బోధనలు రాబోయే తరం వారికందే విధంగా ప్రతి భక్తుడు కృషి చేయాలని ఆయన చూపిన ఆధ్యాత్మిక శాంతి మార్గలో నడవాలని అన్నారు. పులాజి బాబా మానవసేవయే మాధవసేవగా కృషి చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మనిషి పని చేసుకుంటూ పోతే అనుకున్న పనులు అవుతాయని ఒక మంచి మార్గంతో నడవాలని కలెక్టర్ కోరారు. ఆలయ కమిటీ సభ్యులు సూచన మేరకు ఎంపీ నగేష్ తో పాటు జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తో మాట్లాడి సమస్త అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు పులాజి బాబా తపస్ చేసిన దామాజీ లోయకు రోడ్డుతో పాటు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదేవిధంగా పాల్గొన్న భక్తులు పూలాజి బాబా చేసిన ఆధ్యాత్మిక ధ్యాన ప్రవచనాల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ కొటు కులే భక్తురాలు కమల సద్గురు పులాజి బాబా జీవిత చరిత్ర ప్రవచనాలధ్యాన మార్గాలనుపై రచించిన గ్రంథ పుస్తకలను క్యాసెట్ను ఎంపీ, కలెక్టర్ ఎస్పీ వక్తల సమక్షంలో విడుదల చేశారు. జయంతి వేడుకలలో పాల్గొన్న భక్తులకు భక్తులకు ప్రజలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిర క్యాంపు ఏర్పాటు చేశారు. బాబా చేసిన సేవలు ఆధ్యాత్మి మార్గాలపై ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇష్టాలు పాల్గొన్న వక్తలు ప్రజలు తిలకించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫా బాద్ జిల్లా ఎస్పీ క్రాంతి లాల్, కిన్వాట్ ఎమ్మెల్యే భీమ్రావు కేరం, మహారాష్ట్ర మాజీ మంత్రి శివాజీ రావు మాజీ ఎమ్మెల్యే ఉత్తంరావు ఇంగ్లె, మహారాష్ట్ర స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాందాస్, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యాం నాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, జైనూర్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ రావు, ఉత్తంరావు, ఆదిలాబాద్ గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య ఆదిలాబాద్ డిఎస్పి రఘునాథ్, అసిఫాబాద్ ఆర్డిఓ లోకేశ్వరరావు, ఉట్నూర్ పివిటిజి ఏపీఓ మెస్రం మనోహర్,ఆసిఫాబాద్ విద్యుత్ శాఖ ఎస్సీఈ శేషారావు, జైనూర్ సిఐ రమేష్ ఎస్సై రవికుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తాసిల్దార్ ఆడ బీర్ షావ్, ఆంధ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు కైలాస్ ఆసిఫాబాద్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు విష్ణు మగాడే, నారాయణ, సిద్దేశ్వర సంస్థాన్ కమిటీ అధ్యక్షులు ఇంగ్లె కేశవ దాదా, ఉపాధ్యక్షులు వామన్ రావు కార్యదర్శులు దాదారావు, సుభాష్ దుర్క్రే, విష్ణు, అధికారులు, ఉద్యోగులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.















# పండుగే.. పండుగ..!

ఇగ జూసుకో.. ఇంతకన్నేం కావాలె. ఇన్ని రోజులు ఆలస్యమైనందుకు యాళ్లకు వచ్చినయ్. పండుగే పండుగపో.. తాగొచ్చు... తలంటి పోసుకోవచ్చు. నిలవడ్డొని సావ్ నిలవడ్డాడు సత్తడు.. మనకెందుకురా.. సీసా దొరికిందా.. కడుపు నిండిందా.. పూట గడిసిందా..? సాలదారా.. ఇంతకంటే ఏం కావాలె... ఎలచ్చన్ కమిషన్ కడుపు సల్లగుండా.. సర్పంచ్ ఓట్లను సరిగ్గా దసరా సమయానికే వచ్చేటట్టు చేసి మహపుణ్యం కట్టుకుద్దిపో.. ఇగ ఈ నెల, నెల పది రోజులు తాగినంత తాగుడు.. తిన్నంత తినుడు. అండ్లనే బొడ్డెమ్మ, బతుకమ్మ, దసరా.. అన్ని మంచి మంచి పండు గలన్నీ వత్తానయ్. ఓట్లెమేగానీ గ్రామాల్లో మాత్రం ఏరులై పారుతుందో.. వరదలై ముంచుతుందోగానీ మద్యం, మాంసం ముంచే వాతావరణం కళ్లముందే కదులుతోంది. రాష్ట్ర కేబినెట్ కూడా సెప్టెంబర్‌లోనే సర్పంచ్ ఎన్నికలు ముగిస్తామని చర్చించిన నేపథ్యంలో ఊర్లన్నీ ఊగిపోనున్నాయనే ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సర్పంచ్ ఎలక్షన్లా.. మజాకా..? పండుగే.. పండుగా... తాగుడే.. తాగుడు.

- పండుగే.. పండుగ..
- సెప్టెంబర్‌లో సర్పంచ్ ఎలక్షన్స్
- కేబినెట్ భేటీతో స్థానిక ఎన్నికలపై క్లారిటీ
- గ్రామాల్లో మరింత సందడి వాతావరణం
- మందుబాబులకు మస్త్ పసంద్..
- చేను, చెల్కా, రచ్చబండ.. అంతటా అదే చర్చ...
- గణేష్ మండపాల్లో ఆశావహుల సందడే సందడి..
- మరో 10 రోజుల్లో స్థానిక ఎన్నికలు

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

గ్రామాలన్నీ వినాయకుడి వేడుకలతో పాటు స్థానిక సమరం ఏర్పాట్లలో తలమునకలై ఉన్నాయి. మండపాల్లో ఆశావహుల సందడి మామూలుగా కనిపించడం లేదు. ఎన్నాళ్లో వేచిన ఉదయం అన్నట్టుగా నెలలుగా ఎదురుచూస్తున్న మా జీలు... యేండ్లుగా చూస్తున్న నయా ముఖాలు బరిలో నిలబ డడానికి ఉవ్విళ్లూరుతున్న ఘడియలు సమీపిస్తుండడంతో కోలాహలం కనిపిస్తున్నది. ఓ వైపు వ్యవసాయ పనుల్లో రైతాంగం.. మరోవైపు రాజకీయ రణానికి పావులు కదుపుతున్న నాయకగణం.. ఎవరి పనుల్లో వారు తలమునకలై ఉన్నారు. సందట్లో సడేమియాగా పండుగ రానైతే వచ్చింది.. ఎలాగోలా నెలన్నర పాటు ఇక ఢోకా లేదు. అనే బాపతుగాళ్లు ఎంజాయ్ చేస్తున్నారు. పల్లెలన్నీ మత్తులో పట్టుతప్పే వాతావరణంలో జోగుతున్నాయి.

**గ్రామాల్లో మరింత సందడి వాతావరణం...**

ఆదిదేవుడి పూజా కార్యక్రమాలతో యావత్ దేశమంతా ఉర్రూతలూగుతోంది. అదే సమయంలో తెలంగాణలో ప్రత్యేకంగా స్థానిక సంస్థలకు ఎలక్షన్లు నిర్వహించాలని నిర్ణయించడంతో ప్రత్యేక వాతావరణం నెలకొంది. సర్పంచ్‌గా ఎన్నిక అవడం అంటే ఇప్పుడు యూత్‌కు ఓ క్రేజ్. ఇప్పటికే నెలలుగా తాము బరిలో ఉండబోతున్నామనే సంకేతాలు ఇచ్చిన యువనాయకత్వం ఇప్పుడు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటోంది. ముందుచూపుతో వినాయకుడి మండపాల వద్ద సదరు అభ్యర్థుల సందడి మామూలుగా కనిపించడం లేదు. వారి వెంట మందీ మార్బలం.. ఇతరత్రా బలగం కోలాహలం గురించి ఎంత చెప్పినా తక్కువే. పార్టీల పరంగా విభజించినట్టుగా మారుతున్న నాయకత్వాలు వారి వెంట నడిచే జనాలతో గ్రామాలన్నీ అదోరకం పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

**మందుబాబులకు మస్త్ పసంద్...**

మందుబాబులకు మస్త్ పసందైన సమయమిది. సెప్టెంబర్ నెలంతా పండుగే. ఓటు అనే ఆయుధాన్ని తమకు కావాల్సింది రాబట్టుకోవడానికి వాడుకునేది మల్చుకునే పనిలో వారంతా తలమునకలై ఆలోచిస్తూ తరుణం కోసం చూస్తున్నారు. కాలు కదలకుండా, కడుపులో సర్వం పడేలా అంది వచ్చిన అవకాశాన్ని వాడుకుని తమ దాహాన్ని తీర్చుకోవడానికి కాచుక్కూర్చున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టుగా తమ ఆలోచనకు పదును పెట్టి, అందినకాడికి తమదైన సరుకును దండుకోవడా నికి శక్తినంతా కూడగడుతున్నారు. ఏదిఏమైనా స్థానిక సమరం ఊర్లలో పండుగ వాతావరణం తీసుకురావడంతో పాటు ఆశావ హులకు కాస్త ఆందోళనకు గురిచేసే ఘడియలను మోసుకొచ్చిం దనడంలో ఏ మాత్రం అనుమానం అవసరం లేదు.

**10 రోజుల్లో స్థానిక ఎన్నికలు...**

రాష్ట్రంలో రాజకీయం మరోసారి వేడెక్కనుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియరైంది. బీసీ రిజర్వేషన్లపై సర్కారు శనివారం కీలక ముందడుగు వేసింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీలోని కమిటీ హాలులో కేబినెట్ భేటీ అయింది. ఈ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, సీఎస్ రామకృష్ణ రావు పాల్గొన్నారు. కేబినెట్ భేటీలో స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణకు మంత్రివర్గం ఆమోదం తెలిండి. సెప్టెంబర్ నేస్థానిక ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. సర్కార్ తాజా నిర్ణయంతో సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగనుంది. అదేవిధంగా రాష్ట్రంలో పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 కు సవరణ చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. భౌగోళిక, సామాజిక ఆర్థిక పరిస్థితులు, రాజకీయ వెను కబాటు, సర్వే సమాచారాన్ని దృష్టిలో పెట్టుకుని అసాధారణ పరిస్థితుల్లో సంబంధిత స్థానిక సంస్థల్లోని పరిస్థి తుల ఆధారంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తవేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అయితే, రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో అసెంబ్లీలో బిల్లు పెట్టేందుకు నిర్ణయించారు. అదేవిధంగా విద్య, ఉపాధి, ఉద్యోగం, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో తీసుకురావాలని నిర్ణయించారు. కాగా ప్రతిపక్షాలు మాత్రం రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేతపై అవగాహన లేకుండా ప్రభుత్వం ముందుకెళ్తొందన్నా రు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో హైకోర్టు ఇచ్చిన డెడ్‌లైన్ కారణంగా రిజర్వేషన్ల విషయంలో సుప్రీం, హైకోర్టు తీర్పులు పరిగణనలోకి తీసుకోకుండా రిజర్వేషన్ల సీలింగ్ విషయంలో ప్రభుత్వం హడావుడిగా నిర్ణయం తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ నిర్ణయం లీగల్‌గా నిలబడే అవకాశం లేదన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఉద్దేశించిన బిల్లులను రాష్ట్రపతి పెండింగ్‌లో పెడ్డటం ఆర్డినెన్స్ సైతం పెండింగ్‌లో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోతో ముందుకు వెళ్లాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ క్రమంలోనే శనివారం నిర్వహించిన కేబినెట్ భేటీలో పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285కు సవరణ చేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ ప్రకారమే స్థానిక సంస్థల కు ఎన్నికలు నిర్వహించేలా ఈ అసెంబ్లీ సమావేశా ల్లోనే పంచాయతీరాజ్ చట్ట సవరణబిల్లు తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## సెప్టెంబర్‌లో సర్పంచ్ ఎలక్షన్స్...

**ఆలస్యమైన ఎన్నికల ఊపైతే రానే వచ్చింది. లేట్‌గా వచ్చినా లేటెస్ట్ అన్నట్టుగా కరెక్ట్ టైంకు ఎలక్షన్లు వచ్చినట్టు ఫీల్ కలుగుతోంది. గణనాథుడి సందడి నెలకొన్న తరుణంలో సెప్టెంబర్ లో స్థానిక ఎన్నికలపై రాష్ట్ర సర్కార్ ఓ స్పష్టత ఇవ్వడంతో పల్లె జనం పరమ ఆనందంలో మునిగిపోతున్నది. అసలే సెప్టెంబర్ బొడ్డెమ్మ, బతుకమ్మ.. ఒకటి రెండు రో జులు అటుఇటూగా వచ్చే నెలలో రానున్న దసరా తెలంగాణకే పెద్దపండుగ దసరా సమయంలో ఎలక్షన్లు రావడంతో మందుబాబుల పంటపండినట్టే అయింది. ఆశావహుల గ్రూపుల్లో తమ ముఖం కనిపించేలా జాగ్రత్తలు పడుతూ అందివచ్చిన అవకాశాలని వదులొద్దనే తీరుగా సాగుతున్నారు.**



## పిల్లలపై లైంగిక వేధింపులకు
# అడ్డుకట్ట వేయాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పభాకర్ రావు**

**ఆదిలాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

ఇటీవల పిల్లలపై బంధువులు, తెలిసినవారే లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోయాయని, ఈ విషయమై తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు సూచించారు. పోక్సో యాక్ట్ తీవ్రత, విచారణ తీరు గురించి శనివారం జరిగిన సమావేశంలో ఆయన వివరించారు. ఆయన మాటాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేయాలన్నారు. పిల్లలపై అత్యాచార ఘటనకు పాల్పడిన వారికి పదేళ్లకు పైగా శిక్ష పడుతుందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అదే విధంగా పిల్లలను బెదిరింపులకు గురి చేసి ఎవరైనా లైగింక వేదింపులకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. దీంతో నిందులకు శిక్షపడే అవకాశం ఉంటుందన్నారు.త

# 'శాంతి' కమిటీ సమావేశం బహిష్కరించిన ఉత్సవ ప్రతినిధులు

## నవరాత్రోత్సవ ఏర్పాట్లపై అసంతృప్తి

**ఆదిలాబాద్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రోత్సవ ఏర్పాట్ల నిర్వహణపై హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరించి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో స్రవంతి ఆధ్వర్యంలో ఆయా మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ మతాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు. మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు తాము చేపట్టిన ఏర్పాట్లను వివరిస్తుండగా ఉత్సవ సమితి ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశాల్లో చెప్పిన అంశాలు కాగితాలకే పరితమవుతున్నాయే తప్ప సౌకర్యాల కల్పనలో అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేడుకల ప్రారంభానికి ముందు నిర్వహించిన సమావేశంలో తాము ప్రస్తావించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేని పేర్కొంటూ సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. ఆర్డీవో నచ్చజెప్పే ప్రయత్నం చేసినా పట్టించుకోలేదు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మాండ్లు మాట్లాడుతూ.. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి అధికారుల నుంచి సహకారం కరువైందన్నారు. చాలా చోట్ల చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో పలు విగ్రహాలు దెబ్బతిన్నాయని, అలాగే రోడ్ల గుంతలు పూడ్చలేదని, వీధి దీపాలు సైతం వెలగడం లేదన్నారు. రూ.16లక్షల నిధులు కేటాయించినట్లు చెబుతున్నావాటిని ఎక్కడ, ఎలా ఖర్చు చేస్తున్నారో తెలియడం లేదన్నారు. 1న కలెక్టర్, ఎస్పీల సమక్షంలో జరిగే సమావేశం వరకు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**ఖానాపూర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

సికింద్రాబాద్-నాగపూర్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్లో హాల్టింగ్ కల్పించడాన్ని పురస్కరించుకుని, లక్షెట్టిపేట పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా ముత్తే సత్తయ్య, జిల్లా కోశాధికారిగా రమేష్ జైన్ నియమితులైన సందర్భంగా వారిని సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు వీరమల్ల హరిగోపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# జ్వరంతో బాలుడు మృతి

**తిర్యాణి, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**



జ్వరంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు గిన్నెదరి గ్రామానికి చెందిన ఆడ రాము కుమారుడు సీతారాం (15) పది హేను రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో చికిత్స అందించినా తగ్గకపోవడంతో మూడు రోజుల క్రితం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మూడు రోజుల వ్యవధిలోనే ఇద్దరు పిల్లలు జ్వరం చనిపోవడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.






# పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం

- బాసర గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో పంట నష్టపోయిన రైతులందరికీ చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ భరోసా ఇచ్చారు. శనివారం బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామంలో ఇటీవల భారీ వర్షాలు కురిసి, వరదల వల్ల నష్టపోయిన పంటలను కలెక్టర్ పరిశీలించారు. స్థానిక రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు సంబంధించిన వివరాలను వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన ప్రతి ఎకరాకు సంబంధించిన పంట వివరాలను పకడ్బందీగా నమోదు చేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారం సహాయం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పంట నష్టపోయిన రైతులు ధైర్యపడవద్దని, ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం బాసర గోదావరి నది ప్రవాహాన్ని బ్రిడ్జ్ సమీపంలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఎగువ ప్రాంతం నుంచి నీటిని వదిలి నందున గోదావరి నది మునుపెన్నడూ లేని విధంగా ఉధృతంగా ప్రవహిస్తుందని, లోతట్టు ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రజలు ఎవరు నీటి ప్రవాహం వైపుకు వెళ్లకుండా ఉండాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్థానికంగా ఎస్డిఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవాహం వైపునకు వెళ్లకుండా నియంత్రించేలా పోలీసు వారు పటిష్ట పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఆయా ప్రాంతాలలో పికెటింగ్ కేంద్రాలు నిరంతరం నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఏర్పడిన ఆస్తి, పంట నష్టానికి సంబంధించిన వివరాలు ఆయా శాఖల అధికారులు సేకరిస్తున్నారని, త్వరలోనే ఈ వివరాలన్నింటినీ ప్రభుత్వానికి పంపి, నష్టపరిహారం, దెబ్బతిన్న వసతులకు సంబంధించి మరమ్మత్తులు చేపడతామని తెలిపారు. ఆ తర్వాత ఆలయం సమీపంలో వరద ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. వరద నీటిని ఖాళీ చేయించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వరదల వల్ల ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన పంటల అధికారి రమణ, తహసిల్దార్ పవన్ చంద్ర, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**పునరావాస కేంద్రాలకు వరద బాధితులు..**

మహారాష్ట్ర నుంచి వరద పోటెత్తడంతో భైంసా పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఐదు గేట్లను అధికారులు ఎత్తివేశారు. ఇన్ ఫ్లో కింద 31,450 క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో ఔట్ ఫ్లో కింద 37 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నది. పరివాహక ప్రాంతాలైన బైపాస్ రోడ్డు, భట్టిగల్లీలోని శివాలయం, శ్మశాన వాటిక, మైనార్టీ పాఠశాల, ఆటోనగర్, రాహుల్ నగర్‌లోని డబ్బా గల్లీ, కుభీర్ చౌరస్తాలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, టౌన్ సీఐ గోపీనాథ్, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను కేఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.



# భూ సేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి

సింగరేణి సంస్థ సిబ్బంది పరిపాలన, సంక్షేమ విభాగ సంచాలకులు గౌతమ్ పొట్రు



**మంచిర్యాల, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

సింగరేణి పరిధిలో భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని సింగరేణి సంస్థ సిబ్బంది పరిపాలన, సంక్షేమ విభాగ సంచాలకులు గౌతమ్ పొట్రు అన్నారు. శనివారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష లతో కలిసి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు, ఎస్టేట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ సిబ్బంది పరిపాలన, సంక్షేమం విభాగ సంచాలకులు మాట్లాడుతూ సింగరేణి పరిధిలో చేపట్టే భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని తెలిపారు. భూ యజమానులు, సింగరేణి సంస్థ సమన్వయంతో వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు జిల్లాకు విచ్చేసిన సంచాలకులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## నిర్మల్ జిల్లా నూతన డీఈవోగా
# భోజన్న బాధ్యతలు స్వీకరణ



**నిర్మల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భోజన్న నిర్మల్ జిల్లా జిల్లా విద్యా అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు జంగాం జిల్లా విద్యా కార్యాలయంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయన నియామకం తక్షణమే అమల్లోకి వచ్చింది. గతంలో ఈ బాధ్యతలు నిర్వర్తించిన రామారావు పదవీ విరమణ చేయడంతో ఈ మార్పు జరిగింది. ఈ నియామకం తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగుతుంది.

## సిర్పూర్ కాగజ్‌నగర్‌కు
# వందే భారత్ హాల్ట్ మంజూరు

**కాగజ్‌నగర్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు శుభవార్త సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలు ఆగేలా కేంద్ర రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ ప్రాంత ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన రైలు ప్రయాణం అందుబాటులోకి రానుంది. ఈ హాల్ట్ సాధనలో స్థానిక ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు కీలకపాత్ర పోషించారు. పలు మార్లు రైల్వే శాఖ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, కాగజ్‌నగర్ ప్రజల అవసరాన్ని వివరించారు. చివరికి ఆ కృషి ఫలించి, కాగజ్‌నగర్ కూడా వందే భారత్ రైలు మ్యాప్‌లో చోటు దక్కించుకుంది. హైదరాబాద్ నాగపూర్ మార్గంలో వందే భారత్ రైలు ఆగడంతో జిల్లా ప్రజలకు వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. ప్రజలు ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ, ప్రాంత అభివృద్ధికి తోడ్పడినందుకు ఎమ్మెల్యే హరీష్ బాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**నిర్మల్, ఆగస్టు 31 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు శోభయాత్రను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. శనివారం పట్టణంలోని బంగారుపేట చెరువును పరిశీలించి రూట్ మ్యాప్ శోభాయాత్రపై పోలీసులకు సూచనలు సలహాలు అందజేశారు. ఏఎస్పీ రాజేష్ మీనా, అధికారులు ఉన్నారు.

